జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php




సంపుటి 15 సంచిక 318 విశాఖపట్నం | శనివారం 15 జులై 2023 | 8 పేజీలు | వెల : 5.00

# చంద్రయాన్-3 విజయవంతం



సూళ్లూరుపేట: జాబిల్లిపై అన్వేషణ కోసం భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ అత్యంత ప్రతిష్ఠాత్మకమైన చంద్రయాన్-3 ప్రయోగాన్ని శుక్రవారం చేపట్టింది. శుక్రవారం మధ్యాహ్నం 2.35 గంటలకు తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని షార్ రెండో ప్రయోగ వేదిక నుంచి ఎల్‌వీఎం-3 ఎం4 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. ల్యాండర్, రోవర్, ప్రొపల్షన్ మాడ్యూల్‌తో కూడిన చంద్రయాన్-3 యాత్రలో భాగంగా ఈ అత్యంత శక్తిమంతమైన రాకెట్ జాబిల్లి వద్దకు బయల్దేరింది. ఈ రాకెట్ చంద్రయాన్-3ని భూమి చుట్టూ ఉన్న 170 ఎక్స్ 36,500 కిలోమీటర్ల దీర్ఘవృత్తాకార కక్ష్యలో విజయవంతంగా ప్రవేశపెట్టనుంది. ఇది 24 రోజులు పుడమి చుట్టూ తిరుగుతుంది. ఆ తర్వాత క్రమంగా కక్ష్యను పెంచుతూ.. చంద్రుడి దిశగా లూనార్ ట్రాన్స్‌ఫర్ ట్రాజెక్టరీలోకి చంద్రయాన్-3ని పంపిస్తారు. పలు ప్రక్రియల అనంతరం అంతిమంగా చంద్రుడి చుట్టూ 100 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న కక్ష్యలోకి దీన్ని ప్రవేశపెడతారు. ఆగస్టు 23 లేదా 24న ప్రొపల్షన్ మాడ్యూల్ నుంచి ల్యాండర్, రోవర్‌తో కూడిన మాడ్యూల్ విడిపోయి.. చంద్రుడి దక్షిణ ధ్రువానికి చేరువలో సుమారు 70 డిగ్రీల దక్షిణ అక్షాంశం వద్ద దిగనుందని ఇస్రో వెల్లడించింది.

**ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు**

చంద్రునిపై అన్వేషణ కోసం ఇస్రో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చంద్రయాన్-3 తొలిదశ విజయవంతమైంది. బాహుబలి రాకెట్ గా పేరొందిన ఎల్‌వీఎం-3 ఎం4 రాకెట్ శాటిలైట్ ను విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. శుక్రవారం మధ్యాహ్నం 2.35 గంటలకు తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని షార్ రెండో ప్రయోగ వేదిక నుంచి ఎల్‌వీఎం-3 ఎం4 రాకెట్ ద్వారా నింగిలోకి దూసుకెళ్లింది. శ్రీహరికోట షార్ సెంటర్ నుండి కేంద్రమంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్,రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు,తిరుపతి ఎంపీ గురుమూర్తి ప్రత్యక్షంగా చంద్రయాన్ ప్రయోగాన్ని వీక్షించారు.తొలి దశ విజయవంతం కావడంతో ఇస్రో శాస్త్రవేత్తలు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఇస్రో శాస్త్రవేత్తలకు ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేసారు. యావత్ దేశ ప్రజల ఆశలు,ఆకాంక్షలను చంద్రయాన్-3 మిషన్ మోసుకెళ్లిందని ప్రముఖులు అన్నారు. భారత అంతరిక్ష రంగంలో చంద్రయాన్ ప్రయోగం మరో కలికూతురాయిగా నిలిచిపోతుదన్నారు.

# జ్యోతి యర్రాజికి స్వర్ణం..

## సీఎం జగన్ అభినందనలు



అమరావతి : థాయిలాండ్ వేదికగా గురువారం జరిగిన 25వ ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో జ్యోతి యర్రాజీ 100 మీటర్ల హార్డిల్స్‌లో స్వర్ణ పతకం సాధించింది. ఈ సందర్భంగా ఏపీ సీఎం జగన్ అభినందనలు తెలిపారు. ఈ నేపథ్యంలో సీఎం జగన్ ట్విటర్ వేదికగా స్పందిస్తూ.. "వైజాగ్‌కు చెందిన జ్యోతి యర్రాజీకి నా శుభాకాంక్షలు. 25వ ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించి ఎవరికి సాధ్యం కాని రికార్డును అందుకున్నావు. మీ ప్రదర్శనతో అందరినీ గర్వపడేలా చేశారు.. కంగ్రాట్స్ జ్యోతి యర్రాజీ" అంటూ ట్వీట్ చేశారు.

## ప్రధాని మోదీకి

# ఫ్రాన్స్ అత్యున్నత పురస్కారం



పారిస్: ప్రధాని మోదీకి మరో అరుదైన గౌరవం దక్కింది. ఫ్రాన్స్‌లో పర్యటిస్తున్న ప్రధానికి ఆ దేశ అత్యుతన్నత గౌరవ పురస్కారం లభించింది. ప్రధాని మోదీకి దేశాధ్యక్షుడు మాక్రాన్ 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ది లిజియన్ ఆఫ్ హానర్'ను అందించారు?. ఎలిసీ ప్యాలెస్‌లో ఏర్పాటు చేసిన విందులో ఈ పురస్కారాన్ని అందజేశారు. ఫ్రాన్స్ మిలిటరీ, పౌర పురస్కారాల్లో ఇదే అత్యుత్తమైనది. ఇక ఓ దేశ ప్రధానికి ఈ గౌరవం దక్కడం ఇదే తొలిసారి కావడం విశేషం. దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడు నెల్సన్ మండేలా, కింగ్ చార్లెస్, ఫ్రాన్స్ మాజీ చాన్స్‌లర్ ఏంజెలా మెర్కెల్, ఐక్యరాజ్యసమితి మాజీ కార్యదర్శి బుట్రోస్ ఘాలీలు గతంలో ఈ పురస్కారం అందుకున్నారు. 'ప్రధాని మోదీకి ఫ్రాన్స్ దేశ అత్యున్నత పురస్కారమైన గ్రాండ్ క్రాస్ ఆఫ్ ది లిజియన్ ఆఫ్ హానర్‌ను ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ అందించారు. కోట్లాది మంది భారతీయుల తరపున మేక్రాన్‌కు మోదీ కృతజ్ఞతలు తెలిపారు' అంటూ భారత విదేశాంగశాఖ ట్వీట్ చేసింది.

# అతలాకుతలమైన హిమాచల్

## వరదలకు 145 మంది బలి..



(వివరాలు 2లో..)

# మహారాష్ట్ర క్యాబినెట్ విస్తరణ..

**అజిత్‌పవార్‌కు ఆర్థిక శాఖ**



ముంబై: మహారాష్ట్రలో క్యాబినెట్ విస్తరణ జరిగింది. ఇటీవలే ఎన్సీపీని చీల్చి ఎన్డీఏ సర్కారులో చేరిన ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్‌కు ఆర్థికశాఖను కట్టబెట్టారు. మరో ఉప ముఖ్యమంత్రి, బీజేపీ నేత దేవేంద్ర ఫడ్నవీస్ హోంమంత్రిగానే కొనసాగనున్నారు. సీఎం ఏక్‌నాథ్ షిండే గ్రామీణాభివృద్ధి శాఖను అట్టిపెట్టుకున్నారు.ఇక అజిత్ పవార్‌తో కలిసి ఎన్సీపీని వీడిన సీనియర్ నేత చగన్‌భుజ్‌బల్‌కు ఆహార, పౌరసరఫరాల శాఖను అప్పగించారు. గతంలో మహా కూటమి ప్రభుత్వంలో కూడా భుజ్‌బల్ అదే శాఖ బాధ్యతలు నిర్వహించారు. ఇక మరో క్యాబినెట్ మినిస్టర్ దనంజయ్ ముండేకు వ్యవసాయ శాఖ బాధ్యతలు అప్పగించారు. ఈ నెల 2న అజిత్ పవార్ తన బాబాయ్ నేతృత్వంలోని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీని వీడి రాష్ట్రంలోని ఎన్డీఏ కూటిమిలో చేరారు. అందుకు ప్రతిఫలంగా అతనికి ఉప ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టారు.

# ఎన్డీఏ సమావేశానికి జనసేనకు ఆహ్వానం..!



న్యూఢిల్లీ, :బీజేపీ నేతృత్వంలోని ఎన్డియే జులై 18న నిర్వహించ తలపెట్టిన కీలక సమావేశానికి జనసేనాని ఆహ్వానం అందుకున్నారు. గతంలో ఎన్డియేలో భాగస్వాములుగా ఉండి దూరమైన రాజకీయ పార్టీలతోపాటు భావసారూప్యత కల్గిన పార్టీలను సమావేశానికి ఆహ్వానించిన బీజేపీ, కొంతమంది పాత మిత్రులకు మాత్రం ఇంకా ఆహ్వానం పంపలేదని తెలిసింది. అందులో తెలుగుదేశం పార్టీ ఉంది. కొద్ది రోజుల క్రితం తెలుగుదేశం పార్టీకి ఆహ్వానం అందిందని, సమావేశంలో ఆ పార్టీ అధినేత చంద్రబాబు పాల్గొంటారని కూడా చర్చ జరిగింది. అయితే అదే రోజు తమకు ఆహ్వానం అందలేదని టీడీపీ నేతలు, రాష్ట్ర బీజేపీ నేతలు స్పష్టత నిచ్చారు. ఐక్యతారాగం వినిపిస్తూ భారతీయ జనతాపార్టీని ఓడించడమే లక్ష్యంగా జట్టుకడుతున్న ప్రతిపక్షాలకు ధీటుగా ఎన్డియేను బలోపేతం చేసేందుకు కసరత్తు మొదలుపెట్టిన కమలనాథులు ఒక్కో రాష్ట్రంలో ఒక్కో పార్టీకి ఆహ్వానం అందిస్తూ వెళ్తున్నారు. తమిళనాడు లో మిత్రపక్షాలు అన్నాడీఎంకే, టీఎంసీ, పీఎంకే పార్టీలకు ఆహ్వానం అందించారు.

అన్నాడీఎంకే, తమిళ్‌మనీలా కాంగ్రెస్ నేత జీకే వాసన్, పీఎంకే నేత అన్బుమణి రాందాస్‌కు ఈ ఆహ్వానాలు అందాయి. అయితే అన్నాడీఎంకేకు చెందిన పన్నీర్ సెల్వంకు మాత్రం బీజేపీ నుంచి ఆహ్వానం అందలేదు. బీహార్‌లో జనతాదళ్(యునైటెడ్) ఎన్డియే నుంచి దూరమైన నేపథ్యంలో ఆ రాష్ట్రంలో కొత్త మిత్రులను వెతుక్కునే పనిలో కమలనాథులు నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్‌జనశక్తి పార్టీతో పాటు ఆ రాష్ట్ర మాజీ సీఎం జితెన్ రామ్ మాంజీ (హందుస్తానీ ఆవామ్ మోర్చా)కు కూడా ఆహ్వానం పంపించారు. పంజాబ్‌లో పాత మిత్రులు 'శిరోమణి అకాలీదళ్'కు కూడా ఆహ్వానం పంపినట్లు తెలిసింది.

మహారాష్ట్రంలో శివసేన ఎన్డియేకు దూరమైన తర్వాత ఆ పార్టీలో చీలికవర్గం ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనతో కలిసి రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన బీజేపీ, తాజాగా ఎన్సీపీలోనూ అజిత్ పవార్ నేతృత్వంలో చీలిక వర్గాన్ని ప్రోత్సహించి ప్రభుత్వంలో చేర్చుకుంది. 18 నాటి ఎన్డియే మిత్రపక్షాల భేటీకి ఈ రెండు చీలిక వర్గాలకు ఆహ్వానం పంపినట్టు తెలిసింది.

టీడీపీకి నై జనసేనకు సై

తెలంగాణలో బీజేపీకి ఏ పార్టీతోనూ పొత్తు లేదు. ఏపీలో బీజేపీతో కలిసి సాగుతున్న 'జనసేన'ను కూడా తెలంగాణలో దరి చేర్చుకోలేదు. ఈ పరిస్థితుల్లో ఆ రాష్ట్రంలో బీజేపీతో జట్టుకట్టే మిత్రపక్షమేదీ లేదని స్పష్టమైంది. కానీ ఏపీలో ప్రస్తుతానికి బీజేపీతో కలిసి సాగుతున్న జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌కు బీజేపీ అగ్రనాయకత్వం నుంచి పిలుపు అందినట్టు తెలిసింది. తెలుగుదేశంతో జట్టుకట్టేందుకు ఉవ్విళ్లూరుతూ బీజేపీని కూడా అటువైపుగా తీసుకెళ్లేందుకు ప్రయత్నాలు సాగిస్తున్న జనసేనాని ఈ సమావేశంలో పాల్గొనేందుకు ఓకే చెప్పినట్టు కూడా తెలిసింది.



## సంక్షేమ, సంస్కరణల పాలన..: గడపగడపతో సమస్యల పరిష్కారం

**దేవరంపాడు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రాష్ట్ర జల వనరులశాఖామాత్యులు అంబటి రాంబాబు**



రాజుపాలెం : ప్రజాపాలన : సంక్షేమ, సంస్కరణలతో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో సరికొత్త ఒరవడిని సృష్టించారని రాష్ట్ర జలవనురుల శాఖా మాత్యులు లిఅంబటి రాంబాబు అన్నారు. శుక్రవారం నెమలిపురి 02 సచివాలయ పరిధిలోని దేవరంపాడు లో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముందుగా రాష్ట్ర ప్రభుత్వం ముద్రించిన కరపత్రాలను ఇంటింటికి తిరిగి అందించారు. సంక్షేమ పథకాలను, ప్రభుత్వ లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. వాలంటీర్ల సేవలపై ఆరా తీశారు. స్థానికంగా ఉన్న సమస్యలను ప్రజలు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకున్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు సంయుక్తంగా గ్రామాలలో పర్యటించడంతో సందడి వాతావరణం నెలకొంది. అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కారానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సమిష్టిగా కృషి చేయాలని ఆయన సూచించారు.కార్యక్రమంలో మండల కన్వీనర్ ఏపూరి శ్రీనివాసరావు, ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి , జెడ్పిటిసి సభ్యులు దొంతి రెడ్డి సునీత రెడ్డి, ఎంపీడీవో తలుపుల శ్రీనివాసరావు, తహసిల్దార్ నళిని , మండల నాయకులు మర్రి సుబ్బారెడ్డి, జేసిఎస్ మండల ఇన్చార్జి పులిబండ్ల అశోక్ , దేవరంపాడు సర్పంచ్ దీనమ్మ, దేవరంపాడు ఆలయ కమిటీ అభివృద్ధి చైర్మన్ అంబటి బ్రహ్మయ్య, కుప్పాల పిచ్చయ్య , సిహెచ్ శ్రీనివాసరావు, నాయకులు కోటేశ్వరరావు, , సచివాలయ సిబ్బంది, పలు శాఖల అధికారులు, వలంటీర్ల స్థానిక నాయకులు తదితరులున్నారు.

## అన్యాయంగా మా భూములు లాక్కున్నారు

**మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేసిన గుమ్మళ్ళదొడ్డి రైతులు**



గోకవరం జులై 14 ప్రజా పాలన: 50 ఏళ్లకు పైగా తమ పూర్వీకుల నుండి సాగు చేసుకుంటున్న భూములను సీలింగ్ పేరుతో తమ వద్దనుండి లాక్కున్నారని, గోకవరం మండలం గుమ్మడిదొడ్డి గ్రామానికి చెందిన సుమారు 15 మంది రైతులు తమ కుటుంబ సభ్యులతో సహా మీడియా ముందు కంటతడి పెట్టారు.వివరాలకు వెళ్తే, ఇదే గ్రామ రెవెన్యూ పరిధిలో సుమారు 50 సంవత్సరాలకు పైగా సాగు చేసుకుంటూ, ఫల సాయం పొందుతున్న 7.64 ఎకరాల భూమిని 2015లో సీలింగ్ యాక్ట్ పేరుతో తన వద్ద లాక్కున్నారని, ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఈ భూమికి సంబంధించిన సుమారు 12 మంది రైతులు ఉన్నారు. వీరిలో కొంతమంది తమ కుమార్తెలకు, పసుపు కుంకుమ మాన్యంగా ఇదే భూమిని చూపించడంతో, ప్రస్తుతం ఆ భూమి లేకపోవడంతో కుటుంబ కలహాలు ఏర్పడ్డాయని, కొంతమంది రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రైతులంతా కేవలం ఇదే భూమిపై ఆధారపడి, జీవనం సాగిస్తున్నామని, తక్షణం ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు స్పందించి, తగు విచారణ చేపట్టి, తిరిగి భూములను తమకు అప్పగించాలని, రైతులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా ఇదే సీలింగ్ భూమిలో కొంతమేర బయట వ్యక్తులకు ఇచ్చినట్లు అనుమానాలు రావడంతో భూములు కోల్పోయిన రైతులు తీవ్ర మనస్థాపానికి గురవుతున్నారు. అయితే, గతంలో తాము అధికారులను సంప్రదించగా, నిరుపయోగంగా ఉండే భూములను 20 సెంట్ల వంతున ఇస్తామని, అధికారులు తెలిపారని, 20 సెంట్లలో ఏ మేరకు వ్యవసాయం చేసి, కుటుంబాలను పోషించుకోగలమని రైతుల కుటుంబ సభ్యులు ప్రశ్నిస్తున్నారు.

## ఈనెల 17 న సహకార ఉద్యోగుల ఛలో విజయవాడను జయప్రదం చేయండి



నూజివీడు, జూలై 14, ప్రజాపాలన ప్రతినిధి: ప్రభుత్వ ఖజానాపై భారం పడని సహకార సంఘాల ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ సహకార సంఘాల జేఏసీ ఇచ్చిన పిలుపుమేరకు ఈనెల 17వ తేదీన సోమవారం ఉదయం 9:30 ని.లకు విజయవాడ లో ధర్నా చౌక్ వద్ద జరుగు మహా ధర్నాను విజయవంతం చేయాలని ఏపీ పిఎసిఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీ అండ్ టీబీఈఎఫ్ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీలం నాగేశ్వరరావు కోరారు. నూజివీడు పట్టణంలో విలేకరులతో ఆయన శుక్రవారం మాట్లాడుతూ భారతదేశంలో గల అన్ని రాష్ట్రాలు 2006 సంవత్సరంలో ప్రొఫెసర్ ఏ.వైద్యనాథన్ ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ రూ.15,923 కోట్లు భారతదేశంలో గల అన్ని రాష్ట్రాలు పొందినప్పటికీ జీతాలు తీసుకునే విషయంలో వచ్చే టపుడుకి ఆంధ్రప్రదేశ్ తప్ప ఏ రాష్ట్రం నందు జీతాలు పై ఆంక్షలు విధించలేదని ఆయన అన్నారు.ఒక్క మన ఆంధ్ర రాష్ట్ర లోనే ఈ ఆంక్షలు విధిస్తూ సహకార సంఘ ఉద్యోగుల జీతభత్యాలను అంతిమ వార్షిక నివేదిక నందు ఉద్యోగుల జీతాలు తిరిగి చెల్లించాలని డ్యూటు పద్దులలో పెడ్తుతున్నారని ఈ విధానం ప్రపంచంలో ఏ వ్యవస్థలోనూ లేదన్నారు. ఈ విధానాన్ని ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గతనెల గౌరవ.ఆంధ్రప్రదేశ్ సహకారం, మార్కెటింగ్ శాఖ ముఖ్య కార్యదర్శి సమక్షంలో జరిగిన తీర్మానాలు ప్రకారం ఆఫ్కాబ్ కార్యాలయం నుండి జూన్ 12వ తేదీ నుండి ఆగస్టు 2023 వ తేదీ వరకు బదిలీల విషయంలో ఒక కాల పట్టికను రూపొందించి, ఆపట్టికలో బదిలీ ప్రక్రియతో సహకార ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలు, బదిలీలలో ఉన్న అంతర్గత సమస్యలను పరిష్కారించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార సంఘాల కమిషనర్ మరియు రిజిస్టర్ గారికి పంపినప్పటికీ ఈరోజు వరకు నిర్ణయం తీసుకోలేదన్నారు.పరిష్కార మార్గాలను చూపకుండా బదిలీలతో చేతులు దులుపుకోవాలని ప్రభుత్వం చూస్తుందని అన్నారు. ఈ విషయంలో సహకార సంఘాల ఉద్యోగులను ప్రభుత్వం చిన్న చూపు చూడటం తగదని ఆయన అన్నారు. పదవీ విరమణ 62 సంవత్సరంలు పెంపుదల ఆడిట్ రిపోర్టులో సహకార ఉద్యోగుల అనామత్తు పద్దులలో జీతాలు తొలగింపు, ది.01-04-2016 నుంచి మానిటరీ బెనిఫిట్స్ చెల్లింపు ది.01-03-2019 న నియమించబడిన ఉద్యోగులను పర్మినెంట్, జీవో నెం.36 ప్రకారం నిర్ణయుంచిన కరువు భత్యం వ్యత్యాసం వంటి తదితర డిమాండ్లపై సహకార సంఘాల రిజిస్టర్ వారు చొరవ తీసుకొని ప్రభుత్వానికి సహకార ఉద్యోగులకు ఖజానాపై భారం పడదని సిఫార్సు చేసిన యెడల ఈ సమస్యలు తక్షణం పరిష్కారమవుతాయి అని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సమస్యలను వెంటనే పరిష్కరించిన యెడల ఆందోళనను తీవ్రతరం చేస్తామని ఆయన హెచ్చరించారు.

## పిఎమ్ జే జ్యువెల్స్ వివాహ ఆభరణాల 'సీతార కలెక్షన్' అవిష్కరణ




విజయవాడ, జూలై 13: విజయవాడలోని వివంతా (ది గేట్ వే) హెూటల్ వేదికగా జరిగిన 3 రోజుల వివాహ ఆభరణాల ప్రదర్శనలో భాగంగా ఈరోజు 'దక్షిణ భారత్లోనే అత్యంత ప్రియమైన ఫైన్ జ్యువెలరీ బ్రాండ్ పిఎమ్ జె జ్యూవెల్స్' ఆధ్వర్యంలో వారు ప్రతిష్టాత్మకంగా రూపొందించిన పిఎమ్ జె సిగ్నేచర్ కలెక్షన్ 'సితార'ను ముఖ్య అతిథి దేవినేని అనుపమ ప్రారంభించారు. ఈ ప్రత్యేకమైన సందర్భాన్ని పురస్కరించుకుని విజయవాడ గేట్ వే వివంతలో ఎమ్ జ్యువెల్స్ కూడా జూలై 13 నుంచి జూలై 15వ తేది వరకు అతిపెద్ద వివాహ ఆభరణాల ప్రదర్శన జరుగుతాయి.సోషల్ సెలబ్రెటీగా అందరిని ఆకర్షిస్తున్న తార.. సూపర్ స్టార్ మహేష్ బాబు కూతురు "సితార'ను పిఎమ్ జె జ్యువెల్స్ తమ బ్రాండ్ అంబాసిడర్గా ఇటీవలే ప్రకటించింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి దేవినేని అనుపమ సితార కలెక్షన్, వివాహ ప్రదర్శన పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తను మాట్లాడుతూ., విజయవాడలో నిర్వహిస్తున్న ఈ గ్రాండ్ వెడ్డింగ్ ఎగ్జిబిషన్లో సిఎమ్ఐ జ్యువెల్స్ వారి సితార కలెక్షన్ ఆవిష్కరణలో తాను కూడా భాగమవ్వడం గౌరవంగాను, సంతోషంగాను ఉందన్నారు. ప్రతి వివాహ్ ఇందుకు మధురమైన పెళ్లి రోజున అందం, నైపుణ్యం కలగలిసిన ఈ ఆభరణాలు వారికి ఆనందంతో పాటు మధుర స్మృతులను అందిస్తాయని ప్రగాఢంగా నమ్ముతున్నానని పేర్కొన్నారు. పిఎమ్ జె వారి ఈ అద్భుత ప్రయత్నం అభినందనీయం, ఈ ప్రయాణంలో వారు మంచి విజయాన్ని చేరుకోవాలన్నారు.

## కామరాజుపేటలో స్మశానవాటికకు వెళ్లేందుకు కాలిబాట వంతెనకు నిధులు మంజూరు చేయండి

**జిల్లా పరిషత్ సమావేశంలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు**



గోకవరం జులై 14 ప్రజా పాలన: మండలంలోని కామరాజుపేట గ్రామంలో స్మశానవాటికకు వెళ్లేందుకు కాలువపై వంతెన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ఎంపీ వంగా గీతను లిఖితపూర్వకంగా కోరారు. వివరాల ప్రకారం కామరాజుపేటలో సుమారు 12 మంది కులస్థులు కర్మకాండలు నిర్వహించుకోవడానికి కాలువ దాటి వెళ్లాల్సి ఉండగా వర్షాకాలంలో కాలువ దాటలేక కర్మకాండలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీనిపై ఇటీవల గ్రామస్తులు ఈ సమస్యను ఎంపీపీ శ్రీవల్లి వీరబాబు దృష్టికి తీసుకువచ్చారు. దీంతో శుక్రవారం కాకినాడలో జరిగిని జిల్లా పరిషత్ సమావేశంలో ఎంపీపీ శ్రీవల్లి వీరబాబు, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగరమేష్లు జిల్లా పరిషత్ సమావేశంలో విజప్తి చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే చంటిబాబు కాలువపై వంతెన నిర్మించాలని ఎంపీ వంగా గీతను లిఖిత పూర్వకంగా విజప్తి చేశారు. అలాగే ఎంపీపీ, జెడ్పీటీసీలు జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎంపీ వంగా గీతలను స్వయంగా కలుసుకుని వంతెన నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు సుంకర వీరబాబు పాల్గొన్నారు.

## ఎంపీ తలారి రంగయ్య బృందంచే టవర్ క్లాక్ బ్రిడ్జికి మహాత్మా పూలే పేరుకోసం మేయర్ వసీమ్ కు ప్రతిపాదన



అనంతపురం:ఎంతో ప్రతిష్టాత్మాకంగా అనంతపురం నగరంలో టవర్ క్లాక్ నుండీ పీటీసీ వరకూ రెండు వరుసలతో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసుకోవటం హర్షణీయం. స్థానిక ఎంపీ తలారి రంగయ్య గారు, ఎమ్మెల్యే అనంతవేంకట రామిరెడ్డి గారి చొరవతోప్రజలకు వాహన రాకపోకలకు ఎంతో అనువుగా ఈ బ్రిడ్జి నిర్మాణం జరిగింది. అనంత నగరప్రజల అభీష్టం మేరకు ఎస్సి ఎస్టీ బీసీ మైనారిటీ ప్రజాసంఘాలు ఎంపీ గారిని కలసి, మహాత్మా పూలే పేరు ప్రతిపాదించారు. ఈ విషయం అనంత నగర మేయర్ మహమ్మద్ వసీమ్ సలీం గారికి, డిప్యూటీ మేయర్ కోగటం గారికి వినతి పత్రం సమర్పించి, కౌన్సిల్ ఆమోదం చేయుటకు ఎంపీ రంగయ్య గారి ఆధ్వర్యంలో నేడు దాదాపు వందమంది వివిధ సంఘాల నాయకులు కలసి వినతి పత్రం సమర్పించారు.మేయర్ వసీమ్ గారు సానుకూలంగా స్పందించి తప్పకుండా మహాత్మా పూలే పేరు నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈకార్యక్రమంలో ఎంపీ తలారి రంగయ్య గారితోపాటు బీసీ సంఘం సీనియర్ నాయకుడు ఎస్.ఆర్ నాగభూషణం, డాక్టర్ వీరభద్రయ్య,మహాబోధి దాసన్నగారి కృష్ణమూర్తి, ప్రజాగాయకుడు దాసరి ఆదినారాయణ, జాషువా సాహిత్య పీఠం నాగలింగయ్య, ఎన్ జీ ఓ బోసు, బాషా, ఎస్సి ఎస్టీ బీసీ మైనారిటీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## కొత్త సెల్టోస్ ఆరంభంతో కియా ఇండియా ఒక మిలియన్ ప్రొడక్షన్ యూనిట్స్ సంబరాలు

రాజమండ్రి జూలై 14: తమ సరికొత్త ఆవిష్కరణ – ద న్యూ సెల్టోస్ మొదటి యూనిట్ ను విడుదల చేసిన కియా ఇండియా, తమ భవిష్య తయారీ సదుపాయం అనంతపురం నుండి ఒక మిలియన్ వాహనాలను పంపిణీ చేసిన చారిత్రక మైలురాయిని సంబరం జరుపుకుంది. భారతదేశంలో లభించబోయే అత్యంత అభివృద్ధి చెందిన, సురక్షితమైన, స్మార్టర్ ఎస్ యూవీలలో ఒకటైన కొత్త సెల్టోస్ ప్రొడక్షన్ ఆరంభానికి కూడా ఈ సంబరం గుర్తుగా నిలిచింది. కొత్త సెల్టోస్ ఆధునిక డిజైన్, 17 ఫీచర్స్ తో అత్యంత ఆధునికమైన లెవెల్ 2 ఏడీఏఎస్, ఎంతగానో ఎదురుచూసిన పనోరమిక్ సన్ రూఫ్ సహా 32 భద్రతా ఫీచర్స్ తో లభిస్తోంది. ఇది జులై 14 నుండి ప్రీ-బుక్కింక్స్ కోసం అందుబాటులోకి వచ్చింది.

## ఆన్ లైన్ అవగాహనా తరగతుల్లో ప్రసంగాలు



విజయవాడ, ప్రజా పాలన ప్రతినిధి జూలై. 14: "డిప్లొమా ఇన్ జర్నలిజం" కోర్సు విద్యార్థులతో పాటు, రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టులకు సి.ఆర్. మీడియా అకాడమీ ఆధ్వర్యం లో ప్రతి శనివారం నిర్వహిస్తోన్న "ఆన్ లైన్ అవగాహనా తరగతుల్లో" భాగంగా రేపు శనివారం (15-07-23) న "ఒత్తిడిని అధిగమించడం ఎలా?" అనే అంశం పై శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ (రిటైర్ట్) ప్రొఫెసర్ డి.జమున శనివారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు ప్రత్యేక ప్రసంగం చేస్తారని ఆ సంస్థ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాస రావు ఒక ప్రకటనలో తెలిపారు. "పోలవరం ప్రాజెక్టు - పూర్వాపరాలు" అంశం పై ఫ్రీలాన్స్ జర్నలిస్టు సుంకు విశ్వేశ్వరరావు అదే రోజు(15-07-23) ఉదయం 10నుంచి 11గంటల వరకు " ప్రత్యేక ప్రసంగం ఇస్తారని, జర్నలిజం కోర్సు విద్యార్థులు, వర్కింగ్ జర్నలిస్టులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి చైర్మన్ గా తాము అధ్యక్షత వహిస్తామని, మీడీయా అకాడమి కార్యదర్శి మామిడిపల్లి బాలగంగాధర తిలక్, కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ ఎల్.వి.కె. రెడ్డి పరిచయ కర్తగా, మీడియా అకాడమీ కంటెంట్ ఎడిటర్ కలమండ శరత్ బాబు సమన్వయ కర్తగా వ్యవహరిస్తారని చైర్మన్ ఆ ప్రకటనలో తెలిపారు.

## అతలాకుతలమైన హిమాచల్

(మొదటి పేజీ తరువాయి)

రుతుపవనాల ప్రభావంతో దేశవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా ఉత్తర భారతంపై వరుణుడు బీభత్సం సృష్టిస్తున్నాడు. ఢిల్లీ సహా హర్యానా, హిమాచల్ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్ముకశ్మీర్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్లో కుండపోతగా వర్షాలు కురుస్తున్నాయి. భారీగా ఆస్తి, ప్రాణ నష్టం సంభవిస్తోంది. భారీ వర్షాలు, వరద సంబంధిత ఘటనల్లో ఇప్పటి వరకు దేశ వ్యాప్తంగా 145 మందికి పైగా మరణించారు. ఇందులో అత్యధికంగా హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలోనే 91 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇక ఉత్తరప్రదేశ్ లో 14 మంది, హర్యానాలో 16, పంజాబ్ లో 11, ఉత్తరాఖండ్ లో 16 మంది మృతి చెందారు.కొండ ప్రాంతమైన హిమాచల్ ప్రదేశ్ లో దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. భారీ వర్షాల కారణంగా కొండ చరియలు విరిగిపడటం, ఆకస్మిక వరదలతో ఆ రాష్ట్రం అతలాకుతలమైంది. రోడ్లన్నీ దెబ్బతిన్నాయి. పలు వంతెనలు కొట్టుకుపోయాయి. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. జులై 13 నుంచి 17 వరకు ఆ రాష్ట్రం అంతటా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ మేరకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. జులై 19 వరకూ ఆ రాష్ట్రంలో తడి వాతావరణం ఉండే అవకాశం ఉందని అంచనా వేసింది.ఇప్పటి వరకూ 636 ఇళ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. మరో 1,128 పాక్షికంగా దెబ్బతిన్నాయి. మొత్తంగా 1,110 రోడ్లు బ్లాక్ అయ్యాయని ఆ రాష్ట్ర ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్ తెలిపింది. వర్షాలు, వరదల కారణంగా దాదాపు రూ.4,000 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

## జగనన్న చిత్రపటానికి పాలాభిషేకం



గోకవరం జులై 14 ప్రజాపాలన:ఎసైన్డ్ భూములపై యాజమాన్య హక్కు కల్పన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన వైయస్ జగన్మోహన్ రెడ్డికి గోకవరం మండలంలో గోకవరం దేవి చౌక్ సెంటర్ లో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సిఎల్ స్టేట్ డైరెక్టర్ వరసాల ప్రసాద్, క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ వరసాల కుమారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరసాల ప్రసాద్, మాట్లాడుతూ.. సంవత్సరాల తరబడి ఉన్న ఎసైన్డ్ భూములకు సర్వ అధికారాలు కల్పించి దళిత బడుగు బలహీన వర్గాల ప్రజలను రైతులుగా తీర్చిదిద్దిన వైఎస్ జగన్మోహన్ రెడ్డి దళితులంతా రుణపడి ఉంటామని అన్నారు. ఎస్సీలకు స్మశాన వాటిక స్థలమును కేటాయించడానికి కూడా నిర్ణయం తీసుకున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని కొనియాడారు. దళితుల పక్షపాతంగా ఉన్న జగన్మోహన్ రెడ్డిని తెలుగుదేశం దాని మిత్రపక్షాలు ఏమైనా అంటే ఊరుకునేది లేదని మీరు పరిపాలన చేసినప్పుడు ఈ నిర్ణయం ఎందుకు తీసుకోలేకపోయారని సవాల్ ఇస్రారు. ఈ కార్యక్రమంలో బిజ్జి రాజు, గుల్లా ఏడుకొండలు, మచ్చా మోహన్, మడికి మైనర్ బాబు, బూల అబ్బులు, తోలేటి రాంప్రసాద్, మంద పాటి సతీష్, బొడ్డపాటి వీరచంద్రం, గోలి చిన్ని, అంబటి ప్రసన్న మచ్చా జయలక్ష్మి, సుమంగళి, అంద్రు నాగేంద్రుడు, పిల్లి హర్ష, విజ్జిన కిరణ్ కుమార్, మచ్చా మురళి, తాలాటి నాగేందు, బి రాజు, మచ్చా సంజీవ్, గాడ రాంబాబు, నల్లి బుజ్జి, కొండేటి పాపారావు, గోక నాగేశ్వరరావు, గెడ్డం అరుణ్ కుమార్, ఉల్లి బాపిరాజు, గునిపె ఏడుకొండలు, వజ్రంగి మురళి, నేతల చిరంజీవి, బొబ్బర్ల వినయ్, రూపం వాడపల్లి, తదితరులు పాల్గొన్నారు,

## పలు దేవాలయలలో ఘనంగా శాఖాంబరి ఉత్సవాలు



గుడివాడ : పలు దేవాలయలలో శాఖాంబరి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. స్థానిక శ్రీ భీమేశ్వరస్వామి దేవాలయం, విజయదుర్గ అమ్మవారి దేవాలయలో శాఖంబరి ఉత్సవాలను దేవలయం కమిటి సభ్యుల అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారు వివిధ రకాల కూరగాయలతో అలంకారంలో భక్తులకు దర్శనమించారు. ఈ శుక్రవారం అఖరి వారం కావడంతో ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## టిడిపి మహాశక్తి కార్యక్రమానికి తరలి వెళ్ళిన తెలుగు మహిళలు



గుడివాడ : జాతీయపార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన అమరవతిలోని టిడిపి ప్రదాన కార్యాలయంలో జరిగే మహాశక్తి కార్యక్రమానికి శుక్రవారం గుడివాడ నుండి టిడిపికి చెందిన మహిళాల అధ్వర్యంలో భారీ సంఖ్యలో తరలి వెళ్ళారు. ఈ సందర్భంగా పట్టణ టిడిపి మహిళ అధ్యక్షురాలు యార్లగడ్డ సుధారాణి మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అదేశాల మేరకు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత ఆధ్వర్యంలో ప్రారంభమయ్యే మహాశక్తి కార్యక్రమానికి భారీగా తెలుగు మహిళలు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగు మహిళాలు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



గుడివాడ : విద్యుత్ షాక్ తగిలి వ్యక్తి మృతి చెందిన సంఘటన నందివాడ మండలంలోని చోటు చేసుకుంది. సేకరించిన వివారల ప్రకారం శుక్రవారం నందివాడ మండలంలోని రుద్రపాక శివారు గోపాలపురంకు చెందిన దుంపల పెద్దిరాజు(57) శుక్రవారం ఇంటిలోని మోటర్ వేసేందుకు స్విచ్ చేయగా విద్యుత్ షాక్‌కు గురిఅయినట్లు అయన కుమార్డు నాగరాజు తెలిపాడు. 108 వాహానం ద్వార గుడివాడ ప్రభుత్వం ఏరియా అసుపత్రికి తీసుకురాడం జరిగిందన్నారు. వైద్యుల తన తండ్రి పెద్దిరాజు మృతి చెందినట్లు తెలపడంతో పోస్టుమాస్టర్ నిర్వహించారు. నందివాడ పోలీసులు కేసు నమెదు చేసి దార్యప్తు చేస్తున్నారు.

## "జగనన్న సురక్ష"కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తొట్టంబేడు మండల ఇంచార్జ్ పవిత్ర రెడ్డి బియ్యపు



ప్రజాపాలన న్యూస్ శ్రీకాళహస్తి :ఈ సందర్భంగా శ్రీపవిత్ర రెడ్డి మాట్లాడుతూ "జగనన్న సురక్ష"కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్లు ఉచితంగా అందజేయడం. మన ముఖ్యమంత్రి వైయస్ జగన్ అన్న గడపగడపకు వెళ్లి ఈ నాలుగేళ్లలో ప్రజలకు మనం ఏం చేశాం, దాంతోపాటు ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించవలసిందిగా ఎమ్మెల్యేలకు ఆదేశించారు. జగనన్న తీసుకొచ్చిన వాలంటీర్లు, సచివాలయం వ్యవస్థ చూసి కొంతమంది నాయకులు ఓర్వలేక వారిపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు. కరోనా కష్టకాలంలో వాలంటరీ చేసిన సేవ వర్ణనాధితం, దేశం మొత్తం వారి యొక్క సేవను అభినందించారు.అంతేకాకుండా సూర్యోదయం కాకముందే వాలంటీర్లు తలుపుతట్టి అవ్వ తాతలకు పెన్షన్ అందజేస్తున్నారు. మన సచివాలయం పరిధిలో రోడ్లు, మినరల్ వాటర్ ప్లాంట్,డ్రైన్ అంతేకాకుండా ఎమ్మెల్యే గారి సొంత నిధులతో లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా కొన్ని వందల ఎకరాలకు నీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. 30 సంవత్సరాలు ఎమ్మెల్యేగా, మినిస్టర్ గా వాళ్లు కేవలం ఎలక్షన్ అప్పుడు వచ్చి బొట్లు పెట్టి ఓట్లు వేసుకొని వెళ్లిపోయేవారు. కాని మా నాన్న బియ్యపు మధుసూదన్ రెడ్డి గారు గెలిచినప్పటి నుంచి శ్రీకాళహస్తి లోనే కార్యాలయం పెట్టుకొని ప్రజలకు ఎల్లప్పుడ అందుబాటులో ఉంటున్నారు.మీకు ఎ సమస్య ఉన్న మా దృష్టికి తీసుకోని వస్తే తప్పనిసరిగా వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మన రౌత్ సూరమాల గ్రామస్తులు మన గ్రామం లోనే ఇళ్ళ స్థలాలు కావాలని అడిగారు కచ్చితంగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని వెలి,ఇల్లు లేని ప్రతి ఒక్కరికి ఇంటి స్థలాలు ఇప్పించి ఇల్లు కట్టించిన తర్వాతనే మన ఊర్లో ఓట్లు అడుగుతానని అన్నారు.ఈ కార్యక్రమంలో తొట్టంబేడు మండల కన్వీనర్ ఉన్నం వాసుదేవ్ నాయుడు,సర్పంచ్ రాజేంద్ర ప్రసాద్ రెడ్డి, లింగం నాయుడు వల్లి సర్పంచ్ వెంకటేశ్వర్లు నాయుడు, కోన్నలి రవేష్, భక్తవస్థలం,రామయ్య,నాగరాజు,వెంకటయ్య,సుధాకర్ యాదవ్,ఆనంద్,గంధం శ్రీను,మురళి,చింత రాజేంద్ర,వెంకటయ్య,రమేష్,సురేష్,మనోజ్ గ్రామస్తులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పబ్లిక్ స్కూల్ యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలి

**జిల్లా పిడిఎస్యు విజృంభణ కార్యదర్శి శ్రీకాంత్ డిమాండ్..**



గోకవరం జులై 14 ప్రజా పాలన: రవీంద్ర భారత్ స్కూల్ యాజమాన్యం నాణ్యమైన విద్యను అందిస్తామని ప్రజలను మోసం విద్యను వ్యాపారంగా మారుస్తున్నారని.జిల్లా పిడిఎస్ యు కార్యదర్శి పోలిమాటి శ్రీకాంత్ గురువారం గోకవరంలో మీడియా సమావేశం లో మాట్లాడుతూ జగ్గంపేటలో రవీంద్ర భారతి పబ్లిక్ స్కూల్లో ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు ,పిల్లలకు టీసీలు ఇచ్చేస్తున్నామని యాజమాన్యం తల్లిదండ్రులతో చెప్పడం తో ఆ తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు ఆ పిల్లలకు జిల్లా పిడిఎస్ యు విజృంభణ సంఘం అండగా ఉంటుందని పోలిమట్టి శ్రీకాంత్ తెలిపారు.రవీంద్ర భారత్ పబ్లిక్ స్కూల్ ప్రధానంగా ఈ స్కూల్ ఎత్తివేసే ఉద్దేశం తో ముందుగా మండల విద్యా శాఖకు, జిల్లా అధికారులకు,తల్లిదండ్రులకు తెలియజేయాలి.కానీ ఈ యాజమాన్యంనికు రాజకీయ అండదండలతో కనీసం సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యం వైకరిపై మండిపడుతున్న విద్యార్థి స్టూడెంట్ విభాగ కార్యదర్శి శ్రీకాంత్ మండపడ్డారు. ఈ స్కూల్లో వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తూ ఉన్నారు. ఈ స్కూల్లో ఫైర్ సదుపాయం కానీ,వాహనాల ఫిట్నెస్ కానీ, ప్లే గ్రౌండ్ కానీ ఇప్పటికీ లేకపోవడం, విద్యాశాఖాధికారుల నిర్లక్ష్య వైఖరి కూడా కనబడుతుందని శ్రీకాంత్ విమర్శించారు. జగ్గంపేట మండలంలో అనుమతులు లేకుండా చాలా స్కూళ్లు పుట్టగొడుగుల్లాగా పుట్టుకొస్తున్నాయని శ్రీకాంత్ అన్నారు.తక్షణమే రవీంద్ర భారతి స్కూల్ ను ఉన్నత విద్యాశాఖాధికారులు పరిశీలించి,విచారణ చేపట్టి, యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకొవాలి శ్రీకాంత్ డిమాండ్ చేశారు.ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చేయాలని, ప్రతి స్కూలుపై మండల,జిల్లా విద్యా శాఖాధికారుల పర్యవేక్షణ పూర్తి స్థాయిలో ఉండాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంజిబాబు, లోవరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వైసీపీ ఎమ్మెల్యే కి లేని ఆంక్షలు జనసేన కి మాత్రమే ఎందుకు..?



ప్రజాపాలన న్యూస్ శ్రీకాళహస్తి: మొన్నటి రోజు శ్రీకాళహస్తి లో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గ ఇన్చార్జి శ్రీమతి వినుత కోటా గారి ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య బద్దంగా నిరసన తెలియజేయ తలచిన సందర్భంగా వినుత కోటా గారిని గృహ నిర్భంధం చెయ్యడం, జిల్లా కార్యదర్శి కొట్టే సాయి గారిని చెయ్యి చేసుకుని అమానుషంగా పోలీస్ స్టేషన్ కి తరలించడాని ఖండిస్తూ ఈరోజు పవన్ కళ్యాణ్ గారి ఆదేశాల మేరకు తిరుపతి ప్రెస్స్ క్లబ్ నందు జిల్లా అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్ గారి ఆధ్వర్యంలో, జనసేన పార్టీ కాన్ఫ్లిక్ట్ మేనేజ్మెంట్ హెడ్ మరియు నేషనల్ మీడియా ప్రతినిధి శ్రీ. అజయ్ కుమార్ గారి అధ్యక్షతన మీడియా సమావేశం నిర్వహించి పోలీసుల అత్యుత్సాహం, దుశ్చర్యలను ఖండించడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మా నాయకుడి పై చెయ్యి చేసుకుని అమానుషంగా ప్రవర్తించిన శ్రీకాళహస్తి 1 టౌన సీఐ పైన చర్యలు తీసుకోవాలని , తక్షణమే ఆమెను విధుల నుండి తొలగించాలని డిమాండ్ చెయ్యడం జరిగింది. లేని పక్షంలో హుమన్ రైట్స్ కమిషన్ మరియు న్యాయపరంగా గట్టిగా పోరాడతామని తెలిపారు. ప్రజా స్వామ్య బద్దంగా నిరసన తెలియజేసే హక్కు ప్రతిపక్ష పార్టీ గా మా హక్కు, దిష్టి బొమ్మ దగ్ధం చెయ్యడం నిరసన లో భాగమని గౌరవ మద్రాస్ హై కోర్ట్ ఇచ్చిన తీర్పును గుర్తు చేశారు. స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూధన్ రెడ్డి ప్రొద్భంతో గత 4 సం.ఎఎ గా జనసేన పార్టీ పైన పోలీసులను అడ్డు పెట్టుకొని అనేక కేసులు పెట్టీ ఇబ్బందులు పెట్టారని!! ఎమ్మెల్యే పుట్టిన రోజు వేడుకలకు శ్రీకాళహస్తి పట్టణం మొత్తం దిగ్బంధం చేసి 3 రోజులు పట్టణ ప్రజలను, గుడికి వచ్చే భక్తులను ఇబ్బందులు పెట్టినపుడు నిబంధనలు పోలీసులకు గుర్తు రాలేదా, అప్పుడు ఆక్ట్ 30 ఏమైందని ప్రశ్నించారు. పోలీసులు ప్రజాస్వామ్య బద్దంగా ప్రజల కోసం పని చెయ్యాలని కానీ!! వైసీపీ పార్టీ తొత్తులుగా వ్యవహరించవద్దని తెలిపారు. నాయకులు కొట్టే సాయి గారికి పార్టీ అధిష్టానం పూర్తి అండ ఉంటుందని, పవన్ కళ్యాణ్ గారు ఈ విషయమై శ్రీకాళహస్తి కి వచ్చి మద్దతు తెలిపి అండగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జి శ్రీమతి వినుత కోటా గారు , జిల్లా కార్యదర్శి కొట్టే సాయి గారు ,శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు దండి రాఘవయ్య గారు, తిరుపతి పట్టణ అధ్యక్షుడు రాజా రెడ్డి, కృష్ణయ్య , ఆనంద్, ముక్కు సత్యవంతుడు, జనసైనికులు మహేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## టెక్కలి ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్

టెక్కలి:సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి టెక్కలి ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలు పై రోగులకు అడిగితెలుసుకున్నారు. రోగులు అక్కడి సేవలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయండంతో అయన ఆగ్రహం వ్యక్తం చేసారు. ప్రైవేట్ క్లినిక్కుల్లో ప్రభుత్వ వైద్యులు కనబడితే తక్షణ చర్యలు తప్పవంటూ హెచ్చరించారు. డ్యూటీ డాక్టర్ టైమింగ్ 9 నుంచి 4 వరకు ఉండాలని సూచించారు. మందుల పంపిణి స్టోర్ లో ఐ డ్రాప్స్ మాయం కావడం అయన గుర్తించారు. తక్షణమే విచారణ చేపట్టాలని ఆదేశించారు.

## అధికారులు ఇప్పటికైన కళ్ళు తెరిచి ప్రమాద చూచిక ఏర్పాటు చేయాండి - జనసేన ఆర్‌కె



గుడివాడ : స్థానిక గుడివాడ కంకిపాడు రోడ్లో కల్వర్టు స్లాబ్‌కి పెద్ద గుంట పడటంతో వాహనాలు ఆ గుంటలో పడి తీవ్ర ఇబ్బందిలు పడతునరని అధికారుల ఇప్పటికైన కళ్ళు తెరించి కనీసం ప్రమాద చూచికైన ఏర్పాటు చేయాలని జనసేన నాయకుడు మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) అన్నారు. శుక్రవారం విజయవాడ కంకిపాడు రోడ్డులో ఉన్న కల్వర్టుకు పెద్ద రధ్రం పడడంతో వాహనదారులు జనసేన నాయకుడు ఆర్‌కె బారీగేట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రోడ్డులోని కల్వర్టుకు రధ్రం పడిందని మున్సిపల్ అధికారులకు తెలిజేసిన పట్టించుకోలేదన్నారు. తనవంతు సహాయంగా ఆ గుంత దగ్గర డేంజర్ బోర్డు పెట్టి, బారీగేట్‌ను వాహనదారులకు ఇబ్బంది పడకుండ చేయడం జరిగిందన్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే రోడ్డుని మరమ్మతులు చేయలని కోరారు.

## రైతులకు శాపంగా మారిన వైకాపా ప్రభుత్వం: మాజీ ఎమ్మెల్యే రావి



గుడివాడ : కష్టపడి చమటను ఓర్చిన రైతులకు వైకాపా ప్రభుత్వం శాపంగా తయారైందని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరావు విమర్శించారు. శుక్రవారం గుడ్లవల్లేరు మండలంలోని చిన్నగొన్నూరు సమీపంలో సిబి కెనాల్, సీతదేవి చానల్ వద్ద గండి పడి కొతకు గురైన సుమారు 150ఎకరాలు పొలాలను టిడిపి రాష్ట్ర కార్యదర్శి సాయిన పుష్పావతి, స్థానిక రైతు చిట్టిబాబుతో కలసి రావి గండి పడిన పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గుడివాడ అభివృద్ధికి ఇన్ని కోట్లు తెచ్చాను ఆది తీసుకు వచ్చింది నేనే అని చేపే షోలు చేసే మాజీ మంత్రి కొడాలి నాని రైతులకు చేసింది ఏమి లేదన్నారు. గుడివాడ నియోజవర్గంలో రైతులు, కష్టపడే కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్న పట్టించుకోని కొడాలి నాని రాష్ట్రస్థాయిలో ఏది జరిగిన తగుదునమ్మ అన్న చందనంగా తయారు అయ్యే వ్యక్తి ఏమైయి పోయాడని ప్రశ్నించారు. వేసవిలో కాల్వగట్లుకు మర్మత్తులు చేయవలసిన అధికారులు కొడాలి భీనామీలు ఏ విధంగా మట్టిని తరలించుకు పోతునరని చూడడం తప్ప కాల్వలకు రక్షణ కల్పించలేదని విమర్శించారు. వెంటనే సంబధిత అధికారులు గండి పడిన కాల్వకు పనులు చేసి రైతులను అదుకోవలన్నారు. లేని పక్షంలో టిడిపి అధ్వర్యంలో రైతు ఉద్యమం చేస్తామాని హెచ్చారించారు.




జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన

**సంపాదకీయం**

**శనివారం 15, జులై 2023**

# 'కరెంట్ ప్రశ్న'లో తప్పేముంది?

ప్రత్యేక తెలంగాణ పోరాటంలో విద్యుత్తు కూడా ప్రధాన అంశం. నీళ్లతో పాటు విద్యుత్తు కోసం తెలంగాణ రైతాంగం ఉద్యమానికి ఊపిరి పోసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కరెంటు కోసం బలైన రైతన్నలు లెక్కకు మించి ఉన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత, కేసీఆర్ మొదటి దశ పరిపాలన కాలమంతా కూడా కరెంటు కొరతతో రైతు ఆత్మహత్యల రాష్ట్రంగానే తెలంగాణకు పేరు వచ్చింది. రైతులకు 24గంటల త్రీఫేజ్ ఉచిత విద్యుత్ ఇస్తున్నామని అంటున్నవారు అది ఎంతమేరకు, ఎక్కడ అమలవుతున్నదో క్షేత్రస్థాయిలో పరిశీలించారా? సంబంధిత అధికారులు మంత్రులు ఓసారి పొలాల దగ్గరికి వెళితే నిజం తెలుస్తుంది. ఉచిత విద్యుత్ పేరిట బడా భూస్వాములకు పరిశ్రమలకు ఎమ్మెల్యే, ఎంపీల ఫామ్ హౌస్‌లకు మీటర్లు లేకుండా మోటార్లు నడుస్తున్నాయి. ఈ లెక్కలు అన్నింటిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాతనే కదా ఎవరి కరెంటు ఎంతో తేల్చాలని రేవంత్ రెడ్డి తానా సభలో ప్రస్తావించింది. ఏ వేదిక పైన చూసినా, ఏ ప్రచార కార్యక్రమంలో చూసినా, వ్యవసాయానికి 24 గంటలు ఉచిత విద్యుత్తు అనే అంశాన్ని బిఆర్ఎస్ తన ప్రచార అస్త్రంగా వినియోగిస్తూ వస్తున్నది. ఇందులో నిజం ఎంత ఉందో తేల్చాలంటే రెండు మార్గాలున్నాయి. మొదటిది, గ్రామానికి వెళ్లి రైతును అడిగితే సమాధానం దొరుకుతుంది. రెండోది, 11 కేవీ సబ్ స్టేషన్లకు వెళ్లి ఎనర్జీ మీటర్ల నుంచి సమాచారాన్ని తీసినా అవి ఎంత సమయం వ్యవసాయానికి త్రీఫేజ్ విద్యుత్ అందించాయో తెలిసిపోతుంది. మనుషులు అబద్ధాలు చెప్పినా మిషన్లు చెప్పవు. ఈ మధ్యకాలంలోనే జెన్‌కో సిఎండి ప్రభాకర్ రావు 24 గంటలు త్రీఫేజ్ కరెంటు ఇవ్వట్లేదని చెప్పిన విషయం గుర్తుచేసుకోవాలి. రాష్ట్ర సామాజిక ఆర్థిక సర్వే 2023 ప్రకారం రాష్ట్రంలో చిన్న, సన్నకారు రైతుల సంఖ్య 90 శాతం. వీరు సాగు చేస్తున్న భూమి మొత్తం భూమిలో 65శాతం మాత్రమే. వీరికి నిజానికి 24 గంటల కరెంటు అవసరం లేదు. కానీ అవసరానికి మించి ఇస్తే ఎవరు మాత్రం వద్దంటారు? ఈ చిన్న లొసుగును ఆసరాగా చేసుకుని 24 గంటల ఉచిత విద్యుత్తు అంశాన్ని కేసీఆర్ రాజకీయాస్త్రంగా వాడుకుంటున్నారు. గమనించాల్సిందేంటంటే, మిగిలిన 10శాతం రైతుల దగ్గర 35శాతం భూమి ఉంది. వారెవరు పేదవారు కాదు. బడా భూస్వాములు. వీరిలో వ్యవసాయం చేయనివారు ఎంతోమంది. ప్రతినెలా ప్రభుత్వం ఖర్చుచేస్తున్న వ్యవసాయ విద్యుత్ సబ్సిడీ రూ.850 కోట్లలో వీరి వాటా రూ.300 కోట్లు. సంవత్సరానికి రూ.3600 కోట్లు. కాబట్టి, ఈ బడా భూస్వాములకు పేదల రైతుల పేరు చెప్పి ఉచిత విద్యుత్తును అందించడమే కేసీఆర్ ఉద్దేశం. 24 గంటలు ఉచిత విద్యుత్ ఇవ్వడంతో వ్యవసాయ పంపులకు స్టార్టర్లు వాడటం మానేశారు. దీంతో విద్యుత్ వినియోగం 5600 నుంచి 14000 మెగావాట్లకు పెరిగింది. ప్రస్తుతం ప్రభుత్వం ద్వారా జరుగుతున్న విద్యుదుత్పత్తి 8000 మెగావాట్లు మాత్రమే. మిగిలిన 6000 మెగావాట్లు నిరంతరం ప్రైవేట్ సంస్థల నుంచి కొనుగోలు చేయవలసిందే. ప్రైవేట్ సంస్థల నుంచి కొనుగోలు అంటే కమీషన్ల రూపంలో వందలకోట్లు దండుకోవడమే. రైతుకు ఉచిత విద్యుత్ అనే సున్నితమైన అంశంపై సమాజంలో సహజంగా ఉన్న అభిప్రాయానికి భిన్నంగా రాజకీయ నాయకులు స్పందించడం చాలా అరుదు. అయితే నిజాన్ని నిర్భయంగా చెప్పాల్సిన ప్రాథమిక బాధ్యత నాయకునికి ఉంటుంది. ప్రవాసుల సదస్సులో మెజారిటీ సభ్యులు భూస్వామ్య వర్గాలవారు. వారి సమక్షంలో రేవంత్ రెడ్డి ఈ విషయాలను చెప్పడం సాహసోపేతమైతే, మెప్పు పొందడం మరింత ఆశ్చర్యకరం. బడా భూస్వాముల కోసం విద్యుత్ సబ్సిడీ రూపంలో ఖర్చు చేస్తున్న 3600 కోట్ల రూపాయలు వేరే ఏ ఇతర పథకం రూపంలోనైనా ఇదే పేదలకు ఇవ్వవచ్చు అనేది రేవంత్ అభిప్రాయం. ఉచిత వ్యవసాయ విద్యుత్‌ని ఓ ప్రజావసరంగా చూపిస్తూ దానిని తన రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలను నెరవేర్చుకొనే సాధనంగా కేసీఆర్ వాడుతున్న విషయాన్ని తెలియజేయడమే రేవంత్ రెడ్డి ఉద్దేశం. ఉచిత విద్యుత్తు పేర చేస్తున్న తప్పుడు పనులు, అబద్ధపు ప్రచారాలు ఎక్కడ బయటపడతాయో అని ఉలిక్కిపడిన అధికార పార్టీ వాస్తవాలను ఒప్పుకోకుండా, సవాళ్లను స్వీకరించకుండా తానే రోడ్లమీద కొచ్చి ధర్నాలు చేయడం దిగజారుడుతనానికి నిదర్శనం. రేవంత్ రెడ్డి లేవనెత్తిన అంశాలు మూడు. 1) వ్యవసాయానికి 24గంటల ఉచిత విద్యుత్తు అనేది ప్రచార ఆర్భాటం తప్ప నిజం లేదు. 2) ప్రైవేట్ విద్యుత్ జనరేటర్లు నుంచి కమీషన్లు తీసుకున్నారు. 3) విద్యుత్ సంస్థలు తెలంగాణ వచ్చిన తర్వాత రూ.60000 కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టి వేయబడ్డాయి. వీటిపై బీఆర్ఎస్ ప్రభుత్వం తన చిత్తశుద్ధి నిరూపించుకోవాలంటే చేయాల్సింది- 1) 11 కెవి సబ్ స్టేషన్లలో ఫీడర్ ఆపరేషన్ రిపోర్టులను బయట పెట్టడం 2) ప్రైవేట్ ఉత్పత్తిదారులతో జరుగుతున్న ఆర్థిక లావాదేవీల వివరాలను తెలియచేయడం 3) గత తొమ్మిది సంవత్సరాల్లో విద్యుత్ సంస్థల ఆర్థిక స్థితిగతులపైన శ్వేతపత్రాన్ని విడుదల చేయడం. అసలు, బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు కనీస మద్దతు ధర ఇచ్చిందా? లక్ష రూపాయల రుణమాఫీ చేసిందా? ఎరువులకు, విత్తనాలకు సబ్సిడీ ఇచ్చిందా? రైతులు పండించిన ధాన్యాన్ని సరైన సమయంలో కొనకపోవడంతో లక్షలాది రైతుల ధాన్యాలు వర్షాల పాలైనయి. అధికారపక్షం ధర్నాలతో వాస్తవాలను మసిపూసి మారేడుకాయ చేసేందుకు, బలపడుతున్న కాంగ్రెస్ పార్టీ బలాన్ని తగ్గించేందుకు చేస్తున్న కుట్రను ప్రజలు గమనిస్తున్నారు.

# పోలవరం అంటే నిర్వాసితుల త్యాగాలే...

ముంపు గ్రామాల గుర్తింపే ఓ పెద్ద యజ్ఞంలా, ప్రహసనంలా సాగితే ఇక గుర్తించిన వారికి సైతం ఇన్నేళ్ళుగా పునరావాస ప్యాకేజి ఇవ్వకపోవడం మరో బాధాకర ఘట్టం. ఇంకా చెప్పాలంటే మొత్తం ప్రాజెక్టు వ్యవహారంలో ఇదే అతి పెద్ద వైఫల్యం. ఇంత వరకు ముంపులో ఉన్నది లక్షా ఆరు వేల కుటుంబాలైతే...అందులో పునరావాస ప్యాకేజీ ఇచ్చింది కేవలం 12 వేల కుటుంబాలకే. అంటే పద్దెనిమిదేళ్ళు గడిచినా 12 శాతం మందికి కూడా పునరావాస ప్యాకేజీ ఇవ్వలేకపోయిన పాలకులు మిగిలిన 88 శాతం మందికి ఇవ్వడానికి ఎన్ని దశాబ్దాలు పడ్తాయో కదా !పోలవరం అంటే ప్రాజెక్టు మాత్రమే కాదు. అంతకుమించి త్యాగజీవులైన నిర్వాసితులకు పునరావాసం కల్పించడం కూడా. ప్రాజెక్టు మొదలెట్టి పద్దెనిమిదేళ్లయినా పునరావాసం పన్నెండు శాతం కూడా పూర్తికాకపోవడం నిర్వాసితుల పట్ల పాలకుల నిర్లక్ష్యానికి అద్దం పడుతుంది. పునరావాసం కల్పించకుండా వారిని జలసమాధి చేసి ప్రాజెక్టు నిర్మాణం చేయడాన్ని ఎవ్వరూ అంగీకరించరు. ప్రాజెక్టు నిర్మాణం అంటే పునరావాసం పూర్తి చేయడం ద్వారానే సాధ్యమని గుర్తించాలి. గతంలో ప్రకృతి ప్రకోపించడంతో గోదావరికి వరదలొచ్చేవి. నేడు ప్రాజెక్టు నిర్మాణం వల్ల వరదలు వస్తున్నాయి. గతంలో వరదలొస్తే వారం, పది రోజులు మెట్ట ప్రాంతాల్లో పునరావాసం పొందాల్సి వచ్చేది. కాపర్ డ్యాం నిర్మాణంతో నీళ్ళు ఎదురు తన్నడంతో వరదలొస్తున్నాయి. ఎప్పుడూ జులై నెలలో వరదలొచ్చేవి కావు. కానీ ప్రభుత్వ వైఫల్యం వల్ల 2022 జులైలో వరదలొచ్చాయి. 15 నుండి 3 నెలల పాటు కొండలు, గుట్టలు, పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్నారు. ఈ సందర్భంగా చాలామందికి ఉన్న గూడు కొట్టుకుపోయింది. వరదల సమయంలో ఒక కొవ్వొత్తి మాత్రమే ఇచ్చారు. ఈసారి వరదల్లో అగ్గిపెట్టె అయినా ఇస్తారా అని దీనంగా ప్రశ్నిస్తున్నారు. రేషన్ కార్డుపై ఒక మంచినీటి ప్యాకెట్ మాత్రమే ఇచ్చారు. నాడు ఇస్తానన్న వరద పరిహారం సంవత్సరం గడిచినా నేటికీ ఇవ్వలేదు. వరదలు తగ్గాక భూములు సాగుకు సాధ్యం కావడం లేదు. ఉపాధి లేదు. బతికే మార్గం గగనమయ్యింది. ముంపు ప్రాంతం పేరుతో మౌలిక వసతుల కల్పన సైతం ఆపేశారు. దీనితో మాకు రావాల్సిన పునరావాస ప్యాకేజి ఇచ్చి కాలనీలు కట్టిస్తే మా బతుకేదో మేం బతుకుతాం అంటూ వాపోతున్నారు. పాలకులలో మాత్రం కదలిక లేదు.



ప్రాజెక్టు నిర్మాణానికి తొలి నోటిఫికేషన్ 2005 ఏప్రిల్ 15న వెలువడింది. అంటే 18 ఏళ్ళు పూర్తయ్యాయి. జాతీయ ప్రాజెక్టు, అధునాతన పరిజ్ఞానంతో నిర్మాణమని గొప్పగా చెప్తున్నా...నేటికీ ముంపు గ్రామాలేవో, నిర్వాసితులెవరో తేల్చకపోవడమే నిదర్శనం. పాలకులు ఇందుకు సిగ్గు పడాలి. ఫ్లడ్ రిజర్వాయర్ లెవల్ (ఎఫ్ఆర్ఎల్) అని మొదట్లో హద్దులు వేశారు. తర్వాత దశలు. కాంటూరు బ్లాకులు అంటూ విడదీశారు. తొలుత 41.15 మీటర్లు కాంటూరులో ఉన్న గ్రామాలకు పునరావాసం కల్పిస్తామంటున్నారు. తర్వాత 45.7 కాంటూరు పరిధిలోని వారికి పునరావాసం కల్పిస్తామన్నారు. ఈ కాకి లెక్కలతో నేటికీ ఏలూరు జిల్లా కుకునూరు, వేలేరుపాడు, రంపచోడవరం జిల్లాలో వి.ఆర్.పురం, చింతూరు, కూనవరం, ఎటపాక మండలాల్లో ముంపు గ్రామాల ఎంపికలో గందరగోళం సాగుతూనే ఉంది. దీంతో 18 ఏళ్ళైనా ఏ గ్రామాలు మునుగుతాయో, ఏవి మునగవో, మునిగిపోతున్న తమను నిర్వాసితులుగా గుర్తించారో లేదో అని ఆందోళనతోనే జీవిస్తున్నారు.

చిత్రమేమంటే 1986, 2022 సంవత్సరాల్లో వచ్చిన వరదల్లో పూర్తిగా మునిగిపోయిన గ్రామాలు సైతం 41.15 కాంటూరు లోకి రావని, ముంపు గ్రామాలు కావని అనడంతో నిర్వాసితుల ఆక్రోశం వర్ణనాతీతం. వరదల్లో తమ ఇళ్ళపై నుండి పడవలు తిరిగాయని ఇప్పుడు తమ గ్రామం ముంపులోకి రాదంటే ఎలాగని ప్రశ్నిస్తున్నారు. ఇంకా విచిత్రమేమంటే నిర్వాసితులకు నిర్మిస్తోన్న కుకునూరు మండలంలోని కివ్వాక, వెంకటాపురం, కూనవరం మండలంలో భైరవపట్నం, ఎటపాక మండలంలో కన్నాయిగూడెం కాలనీలు ముంపుకు గురయ్యాయి. ఇక పునరావాస కాలనీలు కూడా మునిగిపోతే ఇక మా పరిస్థితి ఏమిటన్న ప్రశ్నకు ప్రభుత్వం నుండి సమాధానం లేదు. కుకునూరు మండలంలో 10 గ్రామాలు వేలేరుపాడు మండలంలో 9, చింతూరు 1, వి.ఆర్.పురం 9, కూనవరం 7 గ్రామాలను మొత్తం 36 గ్రామాలను తొలి దశలో పునరావాసం కల్పించే గ్రామాల జాబితాలో ప్రకటించారు. వేలేరుపాడు మండలంలో బోరేపల్లి, కొత్తూరు, వసంతవాడ, కట్కూరు గ్రామాలలో ఇదే పరిస్థితి. మిగిలిన మండలాలోనూ ఇలాంటి ఉదాహరణలెన్నో. గ్రామాలకు పునరావాసం 70 కి.మీ. దూరంలో కల్పిస్తున్నారు. వీరు ఆ భూముల్ని ఎలా సాగు చేస్తారన్న ప్రశ్నకు సమాధానం లేదు. ఇక భూములు మునిగాక వాళ్ళెలా జీవించగలరనేది ఎవరికైనా తట్టే ప్రశ్న. కానీ ప్రభుతాలకు మాత్రం ఈ ప్రశ్న తట్టడం లేదు. అందుకే ప్రభుత్వం చెప్తున్నట్లుగా నిజంగానే కొన్ని గ్రామాలు ముంపుకు గురికావనే అనుకున్నా దీవుల్లా, దిబ్బల్లా మిగిలే గ్రామాలకు సాధారణ జీవితం, విద్యా, వైద్యం ఇతర మౌలిక సౌకర్యాలు ఎలా అందుతాయి? అందుకే ఈ కాకి లెక్కలు కట్టిపెట్టి మండలాన్ని యూనిట్‌గా తీసుకోవాలని ఈ ప్రాంత ప్రజలతో పాటు, సిపిఎంతో పాటు ఈ ప్రాంతపు సమస్యలపై కొద్దిపాటి అవగాహన ఉన్న వారంతా డిమాండ్ చేస్తున్నారు. ముంపు ప్రాంతాల గుర్తింపుకు ఇదే సరైన ప్రాతిపదిక కాగలదు. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులకు పునరావాస ప్యాకేజీ ఇవ్వడంలోనూ ప్రభుత్వం అనేక మెలికలు పెడుతున్నది. యువతులకు ఇవ్వనని ఒకసారి...ఇప్పుడు ఫ్యామిలీ ప్యాకేజీ అని మాట మారుస్తున్నది. పోరాటాల ఫలితంగా కటాఫ్ తేదీ 2017 డిసెంబర్ నాటికి గుర్తించింది. నేటికీ అత్యధిక గ్రామాలకు పునరావాసం కల్పించకపోవడంతో, ఖాళీ చేయించే తేదీనే కటాఫ్ తేదీగా నిర్ణయించాలని ప్రజానీకం, సిపిఎం కోరుతున్నది.

**గుర్తించినా పునరావాసం దక్కలేదు**

ముంపు గ్రామాల గుర్తింపే ఓ పెద్ద యజ్ఞంలా, ప్రహసనంలా సాగితే ఇక గుర్తించిన వారికి సైతం ఇన్నేళ్ళుగా పునరావాస ప్యాకేజి ఇవ్వకపోవడం మరో బాధాకర ఘట్టం. ఇంకా చెప్పాలంటే మొత్తం ప్రాజెక్టు వ్యవహారంలో ఇదే అతి పెద్ద వైఫల్యం. ఇంత వరకు ముంపులో ఉన్నది లక్షా ఆరు వేల కుటుంబాలైతే...అందులో పునరావాస ప్యాకేజీ ఇచ్చింది కేవలం 12 వేల కుటుంబాలకే. అంటే పద్దెనిమిదేళ్ళు గడిచినా 12 శాతం మందికి కూడా పునరావాస ప్యాకేజీ ఇవ్వలేకపోయిన పాలకులు మిగిలిన 88 శాతం మందికి ఇవ్వడానికి ఎన్ని దశాబ్దాలు పడ్తాయో కదా! ప్యాకేజీ పొందిన వారిలో పోలవరం, దేవిపట్నం మండలాల వారే వున్నారు. అయితే వారి మీద ప్రత్యేక ప్రేమతో పునరావాసం కల్పించలేదు. వీరిని అక్కడి నుండి తరలించనిదే ప్రాజెక్టు పనులు సాధ్యం కావని, వీరి పునరావాస కల్పన నిర్వాకానికి నిర్వాసితులు ఎక్కడ ప్రాజెక్టు పనులకు అడ్డుపడతారోనని వీరికి పునరావాస ప్యాకేజీ ఇచ్చి కాలనీలకు తరలించారు. పోలవరం మండలంలో ఆదివాసీల్ని పోలవరం, బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి, మండలాలకు పునరావాసం కల్పించింది. ఇతరులకి పోలవరం, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, గోపాలపురం మండలాల్లో పునరావాసం కల్పించారు. మోసపూరిత మాటలతో మరికొందర్ని, పోలీసులతో బెదిరించి మరికొందర్ని, దళారుల మాయ మాటలతో ఇంకొందర్ని పునరావాస కాలనీలకు తరలించారు. ఇందుకు నిలువెత్తు ఉదాహరణ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి హయాంలోనే సాగాయి. ప్రాజెక్టు నిర్మాణ గ్రామం, ఆదివాసీలున్న షెడ్యూల్ గ్రామం దేవరగొందిని నాన్ షెడ్యూల్ ప్రాంతానికి తరలించారు. నాటి కలెక్టర్ ఎల్.అగర్వాల్ ఈ వికృత చర్యకు పాల్పడ్డాడు. త్వరలోనే పునరావాస కాలనీని షెడ్యూల్ ప్రాంతంగా గుర్తించేలా చేస్తానని నమ్మబలికాడు. నాడు ఈ చర్యను వ్యతిరేకించినందుకు సిపిఎం నేతల్ని నిర్బంధించడంతో పాటు పునరావాసానికి అడ్డొస్తున్నారంటూ ప్రచారం చేశారు. నాటి నుండి 2022 జులై వరదల్లో కూడా వేలేరుపాడు బోరెడ్డిగూడెం, కోయిదా గ్రామాల వారిని పునరావాస కాలనీలకు వెళ్ళిన మరుక్షణమే ప్యాకేజీ మొత్తం ఇస్తామన్నా నేటికీ బకాయిలున్నాయి. పదేళ్ళక్రితం తరలించిన గ్రామాల్లో సైతం 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులకు ప్యాకేజీని పదుల సంఖ్యలో కూడా ఇవ్వలేదు. వేలేరుపాడు మండలంలో తేప్రాకగొమ్ములో 450 కుటుంబాల్లో కేవలం 5 గిరిజన కుటుంబాలకే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అందించారు. ఇది కూడా మండలంలో 70 గ్రామాలకు 50 గ్రామాలు మునుగుతుంటే 31 గ్రామాలను ముంపులో గుర్తించి 5 గ్రామాల్లో మాత్రమే పరిహారమిచ్చారు. కుకునూరు మండలం భువనగిరిలో చీరవల్లిలో సగం మందికి పరిహారమిచ్చారు. ఈ మండలం పరిస్థితీ ఇంతే. మొత్తం 90 గ్రామాలుంటే 70 గ్రామాలు ముంపుకు గురవుతుంటే 18 గ్రామాలను ప్రభుత్వం గుర్తించింది. వాటిలో ఒక గ్రామంలో పూర్తిగానూ, మరో గ్రామంలో పాక్షికంగానూ పరిహారం చెల్లించారు. ఇక అల్లూరి జిల్లాలో 4 మండలాల్లో ఇంతకంటే ఘోరం. పోడు భూములకు హక్కు పత్రాలు లేవనే సాకుతో ఎవ్వరికీ పరిహారం ఇవ్వలేదు. పునరావాస ప్యాకేజీ రూ.10 లక్షలు, భూమికి పరిహారం రూ.5 లక్షలు ఇస్తామన్న జగన్ ఎన్నికల హామీలు నాలుగున్నరేళ్ళు గడిచినా అతీగతీ లేదు. బటన్ ముఖ్యమంత్రిగా 'నేను కన్నాను. విన్నాను'న్న జగన్ గారికి నిర్వాసితుల కష్టాలు కనపడడం లేదా? మా ప్యాకేజీ బటన్ కూడా నొక్కొచ్చు కదా అన్న వారి మాటలు వినపడ్డం లేదా ?

**నిర్వాసితుల కాలనీల్లో సౌకర్యాలేవీ ?**

రెండు జిల్లాల్లోని 8 మండలాల నిర్వాసితులకు సుమారు 70 కాలనీలు నిర్మిస్తున్నారు. వీటిలో 8 మండలాల గిరిజనేతరులకు జంగారెడ్డిగూడెం మండలంలో చల్లావారిగూడెం (తాడువాయి)లో 10 వేల కుటుంబాలకు ఇళ్ళు నిర్మిస్తున్నారు. గిరిజనులకు షెడ్యూల్ మండలాల్లో నిర్మిస్తున్నారు. రెండేళ్ళు కాకుండానే ఇల్లంతా వాన కురుస్తున్నది. గతంలో మేం పూరిపాకలో వుండేవాళ్ళం. ఇల్లంతా వాన కురిసేది. కురిసేచోట పాత్రలు పెట్టేవాళ్ళం. నేడు కాంక్రీట్ బిల్డింగ్‌లో పాత్రలు పెట్టుకున్నాం. తేడా ఏముందన్న నిర్వాసితుల ప్రశ్నకు పాలకులే జవాబివ్వాలి. 2013 భూసేకరణ చట్టం ప్రకారం 25 సౌకర్యాలతో కాలనీలు నిర్మించాలంటున్నా వాటి జాడే లేదు. ఇప్పటికీ పలు భవనాలు పునాది స్థితిలోనే ఉన్నాయి. పూర్తయ్యాయని చెప్పిన చోట మంచినీళ్ళు కూడా లేక అల్లాడుతున్నారు. వేలేరుపాడు మండలం బోరెడ్డి గూడెం గ్రామస్తులకు జీలుగుమిల్లి మండలంలో నిర్మించిన కాలనీలో 3 రోజుల వరకు నీరు రాకపోవడంతో పొరుగున రైతు బోరు నుండి నాల్గో రోజు నీళ్ళు తెచ్చుకున్నారు. కాలనీకో వీధిలైటు అన్నా పలు చోట్ల ఒక్క లైట్ వెలుగుతున్నది. అత్యధిక చోట్ల అంతర్గత రహదారులు నిర్మించలేదు. పోలవరం మండలం కొరుటూరు కాలనీకైతే లింకు రోడ్డు కూడా లేక అనేక ఇక్కట్లకు గురవుతున్నారు. కాలనీల్లో ఎక్కడా అంగన్‌వాడీ కేంద్రాలు, బడులు, పి.హెచ్.సి లు ప్రారంభం కాలేదు. దీంతో విద్య, వైద్యం అందని ద్రాక్షగా ఉంది. జీలుగుమిల్లి కాలనీలకు చెందిన వారు 7 కిలోమీటర్ల దూరంలోని తాడువాయి పాఠశాలకు వెళ్ళలేక చదువులు చాలిస్తున్నారు. గతంలో ఎత్తైన పాపికొండలపై జీవించారు తెల్లదిబ్బల గ్రామస్తులు. నేడు చెరువులో కాలనీ నిర్మాణంతో నిత్యం నీళ్ళు నిలిచిపోతున్నాయి. చివరికి చనిపోయిన వారికి అంత్యక్రియలు చేయడానికి సైతం శ్మశాన భూమి కేటాయించక పోవడంతో వారి ఆక్రోశం వర్ణనాతీతం. సిరివాక, సరుగుడు, తల్లవరం, పల్లపూరు, రామన్నగూడెం, పలు గ్రామాల వారికి శ్మశానవాటిక లేక ఆందోళన చేయగా...భూములైతే చూపించారుగానీ వాటికి దారులు లేవు. స్థానిక గిరిజనుల సాగులో ఉన్న భూములను గిరజనేతర భూస్వాములు... అధికారులు, ప్రజా ప్రతినిధులతో కుమ్మక్కై తప్పుడు రికార్డులతో పరిహారం పొందారు. పలు చోట్ల ఆ భూములే నిర్వాసిత గిరిజనులకు అంటగట్టారు. ఘర్షణలు తలెత్తిన చోట తమకు సంబంధం లేదన్నట్టు అధికారులు చేతులెత్తేశారు. కొరుటూరు గ్రామస్తుల భూమి నేటికీ వివాదాల్లో ఉంది. పలుచోట్ల పాత భూయజమానులే కౌలు పేరుతో భూములు తమ గుప్పెట్లో ఉంచుకున్నారు. అన్నింటికీ మించి ఉపాధి కల్పనపై నిర్వాసితులకు జీవనం పొందడమే దుర్లభమై పోయింది. ఇప్పటికే యాంత్రీకరణతో వ్యవసాయ పనులు స్థానికులకే తగ్గిపోయాయి. నేడు వారక్కడికి చేరడంతో పనులు దొరకడమే గగనమవుతుంది. ఉపాధి హామీ పనులు చూపడానికి కూడా 'మా మండలంలో మీ జాబ్ కార్డులు లేవు. మీ గ్రామాలు గుర్తింపు లేద'ంటూ నిరాకరిస్తున్నారు. చట్టం చెప్పినట్లు ఇంటికో ఉద్యోగం అన్న మాట కాగితాలకే పరిమితం అయ్యింది. చివరికి ఎస్టీ సర్టిఫికెట్లు జారీ చేయటంలో సైతం రికార్డులు మా దగ్గర లేవనే పేరుతో తిప్పుతున్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చే ఉచిత విద్యుత్‌ను సైతం నిరాకరిస్తున్నారు. ఇప్పుడు వరద గోదావరంత కష్టాలున్న నిర్వాసితులకు పునరావాసంతో మాకు సంబంధం లేదంటూ కేంద్రం, వారు నిధులిస్తేనే మీకు పునరావాసం అంటున్న రాష్ట్ర ప్రభుత్వంపై వారు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఈ తరుణంలో సిపిఎం చేపట్టిన మహా పాదయాత్ర వారికి కొండంత ధైర్యాన్నిచ్చింది. ఐక్యంగా పోరాడితేనే పునరావాసం దక్కుతుందని నిర్వాసితులకు నచ్చజెప్పింది. పోరు కేక పోరుబాటగా మార్చడమే పరిష్కారంగా మహా పాదయాత్ర ద్వారా నిర్వాసితుల్ని చైతన్యపరిచింది. ఆ బాటే వారికి పునరావాసపు బాటలు వేస్తుంది.

## ఎంపీ , పారిశ్రామికవేత్త గోకరాజు గంగరాజు 80వ పుట్టినరోజు వేడుకలు



విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి: ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయం నందు అసోసియేషన్ లైఫ్ చైర్మన్ , మాజీ పార్లమెంట్ సభ్యులు , ప్రముఖ పారిశ్రామికవేత్త , బహుముఖ ప్రజ్ఞాశాలి గోకరాజు గంగరాజు 80వ జన్మదిన వేడుకలు అత్యంత ఘనంగా అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందని , గోకరాజు గంగరాజు అసోసియేషన్ సభ్యులందరికీ కన్నతండ్రి లాంటివారని , వారి దాతృత్వంతో అసోసియేషన్ 2000 మంది సభ్యులు ఆరోగ్యం కోసం ఈత కొడుతూ , వ్యాయామాలు చేస్తూ , బీచ్ వాలీబాల్ ఆడుతూ , సెటిల్ బ్యాట్మెంటన్ ఆడుతూ , ఎన్నో రకాలుగా ఆరోగ్యం కోసం ఇక్కడ వచ్చి ఇక్కడ ఉన్నటువంటి సౌకర్యాలు తమ ఆరోగ్యం పెంపొందించుకుంటానికి ఉపయోగించటానికి మూలకారకులు గొకరాజు గంగరాజు అని , సమాజంలో అనేక రంగాలలో అర్హులైన పేదలకు వారు ఎన్నో సహాయ సహకారాలు అందించారని , పార్లమెంట్ సభ్యులుగా నర్సాపురం నియోజకవర్గం ప్రజలకు ఎంతో సేవ చేశారని , ట్రైబల్స్ కోసం సుమారు 780 ఏకోపాధ్యాయ పాఠశాలలు ఏర్పాటు చేసి ఇప్పటికీ నిర్వహిస్తున్నారని , అలాగే అన్ని రంగాలకు వారు సహాయ సహకారాలు అందిస్తున్నారని , కొన్ని వేల మందికి వారు ఉద్యోగ , ఉపాధి అవకాశాలు కల్పించారని ,వారి పరిచయం కలగడమే ఎవరికైనా అదృష్టం అని , అటువంటి వారి జన్మదిన వేడుకలు మా కమిటీ వారికి కలగటము అదృష్టమని అసోసియేషన్ ఉపాధ్యక్షులు లింగిపిల్లి రామకృష్ణ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ గంగరాజు దాతృత్వం గురించి , వారి సేవాభావం గురించి , వారి యొక్క గొప్పతనం గురించి ఎంత కొనియాడారు ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ఎం.ఎల్. నరసరాజు , అసోసియేషన్ పూర్వపు అధ్యక్షులు సంపర రాంబాబు .,కె.యస్.రామచంద్ర , పూర్వపు కార్యదర్శులు యార్లగడ్డ రమేష్ , అట్లూరి రాజా , బిట్రా వెంకటేష్ , గోకరాజు గంగరాజు మనమడు గోకరాజు ఆదిత్య వర్మ , 400 మంది పైచిలుకు అసోసియేషన్ సభ్యులు పాల్గొని గోకరాజు గంగరాజుకి జన్మదిన శుభాకాంక్షలు తెలియపరచారు. గంగరాజు మాట్లాడుతూ ఇంత మంది అభిమానం పొందడం తన అదృష్టం అని , అందరూ ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉన్నతమైన జీవితం గడపాలని , ప్రతి ఒక్కరూ తమ శక్తి కొలది ఇతరులకు సహాయ సహకారాలు అందించాలని , అందరూ ఆరోగ్యంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని చెప్పారు. తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన ప్రతి ఒక్కరికి కూడా ధన్యవాదాలు తెలియజేశారు.

## వైసీపీ గూటికి వంగవీటి ఆశాలత

విజయవాడ, జూలై 14, :వంగవీటి మోహన రంగా తనయురాలి పొలిటికల్ ఎంట్రీకి తెరవెనుక ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయి.తండ్రి రాజకీయ వారసత్వాన్ని కొనసాగించేందుకు రంగా కుమార్తెను తెరపైకి తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు విస్తృతంగా ప్రచారం జరుగుతోంది.వంగవీటి రంగా వారసురాలు పొలిటికల్ ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు విజయవాడలో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఆమె ఏ పార్టీ నుంచి రాజకీయాల్లో ప్రవేశిస్తారనే విషయంలో స్పష్టత లేకపోయినా రంగా కుమార్తెను తెరపైకి తీసుకురావాలని సన్నిహితులు భావిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీలో బలమైన నాయకుడిగా ఉన్నరంగా ప్రత్యర్థుల దాడిలో ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన రాష్ట్ర రాజకీయాలను తీవ్రంగా ప్రభావితం చేసింది.ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆందోళన చేస్తున్న రంగాను రాజకీయ ప్రత్యర్థులు దారుణంగా హత్య చేయడం 80వ దశకం చివరిలో ఏపీ రాజకీయాలను తీవ్రంగా ప్రభావితం చేసింది. టీడీపీని ఓడించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి రంగా హత్య ప్రధాన కారణం అయ్యింది. మూడున్నర దశాబ్దాల తర్వాత కూడా రంగా ప్రభావం ఏపీలోని కోస్తా జిల్లాల్లో గణనీయంగా ఉంది. రాష్ట్రవ్యాప్తంగా తమ వర్గానికి ఓ ఐకానిక్‌గా భావిస్తుంటారు. ఇతర సామాజిక వర్గాల్లో కూడా రంగా అభిమానులు పెద్ద సంఖ్యలోనే ఉన్నారు.రంగా హత్య తర్వాత ఆయన భార్య రత్నకుమారి కూడా ఎమ్మెల్యే అయ్యారు.ఆ తర్వాత రంగా కుమారుడు వంగవీటి రాధాను చిన్న వయసులోనే ఎమ్మెల్యేగా గెలిపించారు. 2004లో వంగవీటి రాధా పిన్న వయసులోనే శాసనసభ్యుడు అయ్యాడు. 2009 నుంచి రాధా వైఫల్యాలు ఎదుర్కొంటున్నారు. 2009లో వైఎస్ వారించినా వినకుండా చిరంజీవి పెట్టిన ప్రజారాజ్యం తరపున పోటీ చేసి ఓటమి పాలయ్యారు.2014లో వైఎస్సార్సీపీ తరపున పోటీ చేసి ఓడిపోయారు. 2019కు ముందు టీడీపీలో చేరారు. ప్రస్తుతం రాధా టీడీపీలోకొనసాగుతున్నారు.వంగవీటిరంగా కుమార్తె ఆశాలత పేరు ఇటీవలి కాలంలో బెజవాడ రాజకీయ వర్గాల్లో చర్చగా మారింది. రంగా కుమార్తె ఆశను రాజకీయాల్లోకి తీసుకు వచ్చేందుకు సన్నిహితులు ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. రంగా కుమారుడు రాధా రాజకీయాల్లోనే ఉన్నా ఆయన లో ప్రొఫైల్ మెయింటెయిన్ చేస్తుంటారు. అత్యంత సన్నిహితులతో తప్ప పెద్దగా ఎవరితోను కలవరు. రాజకీయంగా చిన్న వయసులోనే వచ్చిన అవకాశాలను నిలుపుకోలేక పోయారనే భావన ఉంది.2018లో వంగవీటి రాధా వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. అప్పట్లో వైసీపీ నేతలు సర్దిచెప్పే ప్రయత్నాలు చేసినా ఆయన ఎవరి మాట వినకుండా టీడీపీలో చేరిపోయారు. గత ఎన్నికల్లో అనూహ్యంగా వైసీపీ అధికారంలోకి వచ్చింది. 2009, 2019 ఎన్నికల్లో ఆయన గెలిచే అవకాశాలు ఉన్నా దుందుడుకుతనంతో రాజకీయ జీవితాన్ని కోల్పోయారు. దాదాపు నాలుగేళ్లుగా ఆయన క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. మళ్లీ ఎప్పుడు యాక్టివ్ అవుతారనేది ఎవరికి తెలీదు. రంగా జయంతి, వర్ధంతి కార్యక్రమాల్లో మాత్రమే రాధా పబ్లిక్‌లో కనిపిస్తున్నారు. టీడీపీ కార్యక్రమాల్లో కూడా ఆయన కనిపించరు.మరో వైపు వంగవీటిరంగా రాజకీయ వారసత్వాన్ని కొనసాగించడానికి ఆయన కుమార్తెను 2024 ఎన్నికల్లో తెరపైకి తీసుకురావాలని సన్నిహితులు ప్రయత్నిస్తున్నారు. రంగా కుటుంబానికి రాజకీయంగా గట్టిపట్టు ఉన్నవిజయవాడ సెంట్రల్ నియోజక వర్గం నుంచి ఆమెను బరిలోకి దింపే అవకాశాలున్నట్లు చెబుతున్నారు. ఆమెతరపున మేనమామ ప్రయత్నాలు చేస్తున్నట్లు పొలిటికల్ సర్కిల్స్‌లో ప్రచారం జరుగుతోంది.

## జగన్ సర్కార్‌కు దేవినేని ఉమ సెల్ఫీ ఛాలెంజ్

### మైలవరంలో జగన్ సర్కార్‌కు మాజీ మంత్రి, టీడీపీ నేత దేవినేని ఉమామహేశ్వరరావు సెల్ఫీ ఛాలెంజ్ విసిరారు



ఎన్టీఆర్ జిల్లా:ప్రజాపాలన ప్రతినిధి: మైలవరంలో జగన్ సర్కార్‌కు మాజీ మంత్రి, టీడీపీ నేత దేవినేని ఉమామహేశ్వరరావు సెల్ఫీ ఛాలెంజ్ విసిరారు. ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఇసుకను గుట్టలు గుట్టలుగా నిల్వ చేసి అమ్మకాలు చేయడంపై మాజీ మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దేవినేని ఉమా మాట్లాడుతూ... టీడీపీ హయాంలో చంద్రబాబునాయుడు మూడు కోట్ల రూపాయలు నాబార్డు నిధులతో ప్రభుత్వ ఆసుపత్రి భవనాన్ని కట్టడానికి శంకుస్థాపన చేస్తే ఈ నాలుగేళ్లుగా పనులు చేయకుండా ఆపేశారని మండిపడ్డారు. ఇప్పుడు ఆ భవనం తాము కట్టామని గొప్పలు చెప్పుకుని సిగ్గు ఎగ్గు లేకుండా శిలాఫలకాలు వేసుకుంటున్నారని విరుచుకుపడ్డారు. సిగ్గు లేకుండా ఇసుక గుట్టలు పోసి అమ్ముకుంటున్నారన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న పేషంట్స్ మీదకు ఇసుక వస్తుందని.. ఆసుపత్రి ఆపరేషన్ థియేటర్లోకి ఇసుక వస్తుంటే తమరు దోచుకోవటానికి ప్రాధాన్యత ఇస్తున్నారని టీడీపీ నేత ఆగ్రహం వ్యక్తం చేశారు. నెలకి రూ.21 కోట్లు తాడేపల్లి ప్యాలెస్‌కు ఈ ఇసుక డబ్బులు వెళుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వాన్ని, ఎమ్మెల్యేను, అధికారులను హెచ్చరిస్తున్నా.. తక్షణమే ఇసుక డంప్ ఇక్కడ నుంచి తీసివేయాలన్నారు. రోగులు, డాక్టర్లు, పనిచేసే సిబ్బంది ప్రాణాలను కాపాడండి వారి ప్రాణాల పట్ల ప్రభుత్వానికి బాధ్యత లేదా? అంటూ ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎక్కడ కూడా ఆసుపత్రి వద్ద ఇసుక డంపులు పెట్టలేదన్నారు. మార్కెట్ యార్డులో, ప్రభుత్వ ఆసుపత్రిలో ఇసుక డంపులు పెట్టి అమ్ముకోవడానికి వచ్చారా అంటూ నిలదీశారు. ప్రకృతి సంపదను వందల కోట్లు దోచేసి ఇష్ట రాజ్యాంగా అమ్ముకుంటున్నారన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇక్కడ నుంచి ఇసుక డంపింగ్ యార్డు తొలగించేస్తామని దేవినేని ఉమా హామీ ఇచ్చారు.

## మంగళగిరి కోర్టులో నారా లోకేష్ వాంగ్మూలం..



గుంటూరు జిల్లా: ప్రజాపాలన ప్రతినిధి: వైసీపీ అసత్య ప్రచారంపై టీడీపీ యువనేత నారా లోకేష్ న్యాయపోరాటం ప్రారంభించారు. ఏపీ అటవీ, అభివృద్ధి సంస్థ ఛైర్మన్, ఏపీ చీఫ్ డిజిటల్ డైరెక్టర్ గుర్రంపాటి దేవేందర్ రెడ్డి, వైసీసీ ఎమ్మెల్సీ పోతుల సునీతపై క్రిమినల్ కేసులు దాఖలు చేశారు.టీడీపీ యువనేత నారా లోకేష్ న్యాయపోరాటం ప్రారంభించారు. ఏపీ అటవీ, అభివృద్ధి సంస్థ ఛైర్మన్, ఏపీ చీఫ్ డిజిటల్ డైరెక్టర్ గుర్రంపాటి దేవేందర్ రెడ్డి , వైసీసీ ఎమ్మెల్సీ పోతుల సునీత పై క్రిమినల్ కేసులు దాఖలు చేశారు. మంగళగిరి అడిషనల్ మేజిస్ట్రేట్ ముందు వాంగ్మూలం ఇవ్వనున్నారు. న్యాయపోరాటం కోసం యువగళం పాదయాత్రకు రెండు రోజులు విరామం ఇచ్చారు.టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు కుటుంబసభ్యులపై అసత్య ఆరోపణలు ప్రసారం చేస్తున్న వైసీపీ నేతల వ్యవహారాన్ని కోర్టులో తేల్చుకోవాలని లోకేష్ నిర్ణయించారు. ఇప్పటికే సాక్షి పత్రికపై పరువు నష్టం దావా వేసిన లోకేష్.. వైసీపీ నేతలు సోషల్ మీడియా బాధ్యులు కూడా తనను టార్గెట్ చేస్తూ అసత్య ప్రచారం చేయడంపై క్రిమినల్ కేసులు దాఖలు చేశారు. వైసీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గుర్రంపాటి దేవేందర్ రెడ్డి, పోతుల సునీతపై మంగళగిరి మేజిస్ట్రేట్ కోర్టులో లోకేష్ క్రిమినల్ కేసులు దాఖలు చేశారు.కాగా మంగళగిరి మెజిస్ట్రేట్ కోర్టు కు హాజరైన జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరావు మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.

## నేటి యువతలో మార్పు కోరుతూ.. గర్ల్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ విజయవాడ




విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి: జులై 14 నుండి 23 వరకు నిర్వహిస్తున్న చేంజ్ బిఫోర్ లైఫ్ ఎండ్స్ "CHANGE (before life ends) అనే 10 రోజుల ఉద్యమం నిర్వహించడం జరుగుతుంది .ఈ ఉద్యమం యొక్క ముఖ్య ఉద్దేశం ప్రస్తుత సమాజంలో మరియు యువతలో నైతికత పెంపొందించడం, అశ్లీలం, అత్యాచారాలు,ర్యాగింగ్, వరకట్నం,స్త్రీ అగౌరవం, మహిళల పై వేధింపులు, ఇలాంటి అనేక చెడుల నుండి ప్రతి ఒక్కరిని దైవభితి మరియు జవాబుదారితనంతో నిండిన వ్యక్తిత్వాన్ని అలవర్చుకునే విధంగా జీవితం అంతంకాక ముందే మార్పు చెందేలా కృషి చేయటమే ఈ ఉద్యమం యొక్క ముఖ్య లక్ష్యం. ఉత్తమ సమాజ నిర్మాణం కేవలం యువతతోనే సాధ్యం, యువత దేశానికీ వెన్నుముక, కావున యువత గళంతోనే "మార్పు" సాధ్యం ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో అఫీఫ తహ్నియత్ జనరల్ సెక్రేటరీ GIO ఆంధ్ర ప్రదేశ్., GIOవిజయవాడ అధ్యక్షురాలు ఆలియ ఫర్హత్, మరియు ఇతర GIO కార్యదర్శులందరూ,JIH మహిళా విభాగం నగర అధ్యక్షురాలు ఖానిత సల్మా లి, మరియు JIH ఇతర కార్యదర్శులు లిజాహెదా బేగం ,ముజాహెదా బేగం మరియు తాహెరా బేగం పాల్గొన్నారు.

## ఆటోనగర్ కాదు అడవి :మొహమ్మద్ నసీర్




గుంటూరు ప్రజాపాలన ప్రతినిధి: ఆటోనగర్ వ్యాపారస్తులు సమస్యలతో అవస్థలురోడ్లు, డ్రైన్లు, వీధి దీపాలు, పారిశుధ్యం, గురించి పట్టించుకునే నాధుడు లేరువేల రూపాయలు పన్నులు కడుతున్న కనీస మంచినీటి కుళాయి లేదుపారిశుధ్యం లేక చెత్తకుప్పగా మారిందిరోజు 15000మంది ఉపాధి కోసం ఆధారపడే ఆటోనగర్ దుస్థితిఆటోనగర్ వ్యాపారాలు, కార్మికుల గోడు గత ప్రభుత్వం లో నిర్మించిన వాటర్ ట్యాంక్ ద్వారా నీళ్లు సరఫరా లేదుమొహమ్మద్ నసీర్ మాట్లాడుతూ రాష్ట్రము ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో ఉకాదంపుడు ప్రచారం చేసుకుంటున్న ముఖ్యమంత్రి, మంత్రులు, శాసనసభ్యుడు ఆటోనగర్ ను అడవిగా మార్చారాణి, ఈ సందర్భంగా వ్యాపారస్తులతో కలిసి Apiic జోనల్ మేనేజర్ గోపాలకృష్ణ గారి దృష్టికి సమస్యలను నసీర్ వివరించారు, వెంటనే పనులు పూర్తిచేసి ఆటోనగర్ అభివృద్ధికి సహకరించాలని నసీర్ కోరారు. ఈ కార్యక్రమం లో ఆటోనగర్ వర్తకుల సంఘం నాయకులు sm. బాషా, మెహమూద్, తాజు, అన్వార్, వెంకటరెడ్డి ఖాజా మెకానిక్,తెలుగుదేశం పార్టీ నాయకులు ssp జాద, కరీముల్లా, మున్వార్, ఖుద్దుస్ పాల్గున్నారు

## సాటి వ్యక్తిని మానవత్వంతో ఆదుకోవటమే హుడా



తెనాలి ప్రజాపాలన ప్రతినిధి: సమాజంలోని సాటి మావుణ్ణి ఆదుకొని అతని కళ్ళలో ఆనందం నింపటమే హుడా లక్ష్యమని ఆసంస్థ ఛైర్మన్ అబ్బాస్ అలిఖాన్ అన్నారు, శుక్రవారం నందుల పేటలోని సీనిసిటిజన్ హాల్లో పేదలకు బియ్యం పంపిణి కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథి గా ఆయన హిందీలో మాట్లాడుతూ మానవుడు శాస్త్ర సాంకేతిక రంగాలలో ప్రగతి సాధించినా సాటి మనిషిని పట్టించు కోవటంలేదని తన సంస్థ HUDA కేవలం మానవతా దృక్పథంతో కులమత లింగ విబేధాలతో అన్ని వర్గాలను రాష్ట్రమంతా ఆదరించిందని ఇక్కడ తెనాలి లో ఇదే ప్రథమమని ఇక్కడి వారి సహకారంతో మరిన్ని సంక్షెమమీలుపేదలకు అందించటానికి సిద్ధంగా ఉన్నానన్నారు. తినే రొట్టెలో సగం ఆకలితో ఉన్నోడికి పెట్టాలన్నదె తమ సంస్థ లక్ష్యమని ఇచ్చేది పైవాడని పంచటమే తన పని అని అన్నారుఈ కార్యక్రమంలో జమాయతె ఇమామే మజ్లిస్ కణమిటి అద్యక్షులు ఫరీద్ మాట్లాడుతూ హుడా తన సేవా కార్యక్రమాలతో రాష్ట్రమంతో ఎంతో ఖ్యాతి గడించిందని ఆ సంస్థ అధిపతి అబ్బాస్ అలి తెనాలి లోని పేద బడుగు వర్గాల ప్రజలకు ఆసరా ఉంటానటం ముదావాహమని తాము వారి కార్యక్రమాలకు స్వాగతిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక కోశాధికారి సలావుద్దీన్ హుడా కార్యక్రమాలకు తాము సహరిస్తిమని మానవ సేవే మాధవసేవ లక్ష్యం గొప్పదన్నారు, ఇంకా బిసి సంఘనాయకులు రాఘవేంద్రరావు గోపి బాకర్ సత్తార్ తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో దాదాపు 350 మంది ఎస్సీ, ఎస్టీ, బిసి మైనార్టీలకు 5కేజీల బియ్యం పంపిణీ చేశారు

## పేరు ఒకరిది.. నోరు ఒకరిది...




ఇబ్రహీంపట్నం ప్రజాపాలన ప్రతినిధి: రైతు మార్కెట్లో జరుగుతున్న అన్యాయం....సబ్సిడీ ధరకే ఇస్తున్న టమాటా విక్రయంలో అవకతవకలు...లైన్ లో మనిషికి 1కేజీ టమాట అంటూ ఇస్తున్నారు కానీ...ఇచ్చిన వారికి మళ్ళీ మళ్ళీ ఇస్తున్న రంటు వెనుతిరిగి వెళుతున్న ప్రజలు..ఎప్పుడు ఇస్తున్నారో ఎప్పుడు అయిపోతున్నాయో అర్థం కాని పరిస్థితి.. మున్సిపాలిటీకి కొండపల్లి అని పేరు పెట్టటం మేం చేసుకున్న పాపమా లేక శాపమా...మేము ఏమి పాపం చేసాము అంటూ కొండపల్లి ప్రజలు ఆవేదన...కొండపల్లి లో కూడా ఇదే విధంగా టమాటా అందించాలని కోరుతున్న ప్రజలు...కొండపల్లి లో కూడా మినీ రైతు మార్కెట్ నిర్మించాలని ప్రజల ఆవేదన...

## నదిలో కొట్టుకుపోయిన స్కూల్

లక్నో, జూలై 14,:ప్రజాపాలన ప్రతినిధి: గత కొద్దిరోజులుగా ఉత్తర భారతంలో వానలు దంచికొడుతున్న సంగతి తెలసిందే. ఉత్తర?ప్రదేశ్‌తో సహా పలు రాష్ట్రాల్లో వరదలు సంభవిస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల ధాటికి ఉత్తర ప్రదేశ్‌లోని లఖింపుర్?ఖేరీలో శారదా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ నది ఒడ్డున ఉన్న పలు గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. దీంతో నదీ పరివాహక ప్రాంతాల్లోని గ్రామస్థులను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ నేపథ్యంలో లఖింపూర్ ఖేరీ జిల్లా ఫూల్‌బెహార్ బ్లాక్‌లోని అహిరానా గ్రామంలోని ఓ ప్రాథమిక పాఠశాల గురువారం శారదా నదిలోకి కొట్టుకుపోయింది. అందరూ చూస్తుండగా 27 సెకన్ల వ్యవధితలో పాఠశాల కొట్టుకుపోయింది. పాఠశాలతోపాటు అదే గ్రామంలోని మరో రెండు ఇళ్లు కూడా నదిలోకి కొట్టుకుపోయాయి.నేపాల్‌లోని కొండ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గత వారం రోజుల నుంచి శారదా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. కేవలం వారం రోజుల్లోనే దాదాపు డజను ఇళ్లు, గుడిసెలు, వేల ఎకరాల పంటలు వర్షార్పితమయ్యాయి. ఈమేరకు మంగళవారం ఖేరీ డీఎం మహేంద్ర బహదూర్ సింగ్ గ్రామాన్ని సందర్శించి గ్రామస్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. ఖేరీ డీఎం మహేంద్ర బహదూర్ సింగ్ మంగళవారం ముంపుకు గురైన గ్రామాన్ని సందర్శించి గ్రామస్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. రెండు రోజుల క్రితం డీఎం మహేంద్ర ఆదేశించినా అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టలేదని గ్రామస్థులు ఆరోపించారు. శారదా నది ఉధృతి వల్ల గత ఐదేళ్లలో సుమారు 200 ఇళ్లు నదిలో కొట్టుకుపోయాయని తెలిపారు.

## కానాపల్లెలో వ్యక్తి దారుణ హత్య

కడప: ప్రజాపాలన ప్రతినిధి: కడప జిల్లా ప్రొద్దుటూరు మండలం కానా పల్లె ఎస్సీ కాలనీలో దారుణ హత్య జరిగింది. ఇంటి పై భాగంలో పడుకుని ఉన్న బాబు అనే వ్యక్తిని గుర్తు తెలియను వ్యక్తులు గొంతు కోసి చంపారు. శుక్రవారం ఉదయం ఎంత సేపటికి కిందికి రాకపోవడంతో భార్య పైకి వెళ్లి చూడగా రక్తపు మడుగులో భర్త పడివుండడం గమనించింది. పక్కింటి పై భాగంలో నుంచి దుండగులు వెళ్ళినప్పుడు రక్తపు మరకలు పడ్డాయి. సంఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు, దర్యాప్తు ప్రారంభించారు.


# గోపిరెడ్డి అంటే పేరు కాదు... ఒక బ్రాండ్

## ప్రతిక్షణం ప్రజల సంక్షేమం కోసం..
## నేనున్నానంటూ.... భరోసా ఇచ్చే నాయకుడు
## అభివృద్ధి... సంక్షేమం...తప్ప మరో ఆలోచన లేదు
## కోట్ల రూపాయలతో నరసరావుపేట నియోజకవర్గం అభివృద్ధి
## మూడోసారి హ్యాట్రిక్ కొట్టబోతున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి



పల్నాడు జిల్లా .నరసరావుపేట .జూలై 14 (ప్రజా పాలన ప్రతినిధి)ప్రతిక్షణం ప్రజల గురించి ప్రతి అడుగు ప్రజల సంక్షేమం గురించి పాటుపడే నాయకుడు ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరడ్డి కోట్ల రూపాయలతో నరసరావుపేట నియోజకవర్గం నీ అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోతున్న నాయకుడు ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి నూతన పల్నాడు జిల్లాలో మూడోసారి హ్యాట్రిక్ కొట్టబోతున్న నాయకుడు ఎమ్మెల్యే గోపిరెడ్డి. ప్రతిక్షణం ప్రజలతో ఉంటూ గడపగడపకు తిరుగుతూ ప్రతి గడపలో సంక్షేమ పథకాలు అందిస్తూ ఒకవైపు అభివృద్ధి మరోవైపు సంక్షేమం రెండు కళ్ళుగా చేసుకొని నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసిన నాయకుడు నియోజకవర్గ ప్రజలకు నేనున్నా అంటూ భరోసా ఇచ్చి సమస్యల పరిష్కారంలో అధికారులకు ఆదేశాలులిచ్చి వెంటనే సమస్యను పరిష్కరించే ఏకైక నాయకుడు, ఏ సమస్య వచ్చినా నేనున్నానంటూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ఒకవైపు అధికారులతో మరోవైపు ప్రజలతో మమేకమై నియోజకవర్గ అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్న నాయకుడు ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలకు దీటుగా సమాధానం చెబుతూ సంక్షేమమే వాళ్లకు సమాధానమంటూ దూసుకుపోతున్న నాయకుడు 2024 ఎన్నికలలో జిల్లాలో అత్యధిక మెజార్టీతో మూడోసారి హ్యాట్రిక్ కొట్టబోతున్న నాయకుడు, నరసరావుపేట గడ్డ గోపిరెడ్డి అడ్డా అని ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన నాయకుడు కులమతాలకు అతీతంగా పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తూ ప్రతిపక్ష నేత లకు సైతం సంక్షేమ పథకాలు అందించిన ఘనత గోపిరెడ్డికే దక్కుతుంది చిన్న పెద్ద తారతమ్యం లేకుండా సహాయం కోరి వచ్చిన వ్యక్తికి సహాయం చేస్తూ ప్రజల హృదయాలలో మనసున్న మా రాజుగా పేరు తెచ్చుకున్నాడు. జిల్లాలో ఎన్ని అడ్డంకులు వచ్చిన నరసరావుపేట కేంద్రాన్ని పల్నాడు జిల్లాగా ఏర్పాటు చేయడానికి ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి చేసిన కృషి నరసరావుపేట ప్రజలు మరువలేనిది ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు అండగా ఉంటూ ప్రతి కార్యక్రమంలో నేనున్నాను అంటూ ముందుకు వచ్చి కార్యక్రమాలను విజయవంతం చేస్తున్నారు గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను ఎప్పటికప్పుడు అధికారులతో చర్చిస్తూ ప్రతి కుటుంబానికి జగన్మోహన్ రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలను అందే విధంగా చర్యలు తీసుకుంటున్నారు దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆంధ్రప్రదేశ్లో సంక్షేమ పథకాలు అందించడంలో వైయస్ జగన్ చరిత్ర సృష్టించారు ఏ రాష్ట్రంలో ఏ దేశంలో లేని విధంగా 31 లక్షల మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేసి వాళ్లకు ఇల్లు నిర్మిస్తున్న ఏకైక వ్యక్తి వై ఎస్ జగన్ నరసరావుపేట లో నిరుపేద ప్రజలకు 7000 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేపించి వారికి ఉంటానికి మంచి ఇల్లు నిర్మిస్తున్నారు పేదవాడికి సొంత ఇంటి కల నెరవేర్చిన ఘనత సీఎం జగన్ కు ఎమ్మెల్యే గోపిరెడ్డికి దక్కుతుంది .జగనన్న కాలనీ ద్వారా ఊర్లు ఊర్లు నిర్మిస్తున్నారు. అమ్మబడి వంటి పథకం ఎంతోమంది పేద విద్యార్థులకు చదువునిచ్చే కల్పవృక్షం విద్య వైద్యం పేదవాడు కి అందాలనే ఉద్దేశంతో జగన్ చేస్తున్న కార్యక్రమానికి చేదోడుగా ఉండి నరసరావుపేట నియోజకవర్గంలో ప్రతి విద్యార్థికి అమ్మబడి పథకం ద్వారా ఫీజులు అందిస్తున్నారు వారి చదువుకు ఎంతగానో తోడ్పాటు చేస్తున్నారు, శత్రువులకు సైతం నమస్కారం పెట్టి మంచి గుణం ఉన్న నాయకుడు ఎమ్మెల్యే గోపిరెడ్డి.

## నేటి బస్సు యాత్రను విజయవంతం చేయాలి



నరసాపురం, జూలై 14 (ప్రజాపాలన ప్రతినిధి) :తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భవిష్యత్తుకు గ్యారెంటీ బస్సుయాత్ర పశ్చిమగోదావరి జిల్లా పర్యటనలో భాగంగా శనివారం మధ్యాహ్నం నరసాపురం పట్టణంలో ప్రారంభం అవుతుందని పార్టీ నాయకులు, కార్యకర్తలు, తెలుగుదేశం పార్టీ అభిమానులు ప్రతి ఒక్కరు ఈ బస్సుయాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని నరసాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ భవిష్యత్తు గ్యారంటీ చైతన్య రథయాత్ర స్థానిక అంబేద్కర్ సెంటరు నుండి ప్రారంభమై పాతబజారు, పంజా సెంటర్, మిషన్ హైస్కూల్ రోడ్డు మీదుగా జగన్నాథస్వామి గుడి వద్దకు చేరుకుని 216 జాతీయ రహదారి గుండా సీతారాంపురం, పాతకాలువ మీదుగా మొగల్తూరు చేరుకుంటుందని అనంతరం మొగల్తూరు గాంధీ బొమ్మ సెంటర్ వద్ద భారీ బహిరంగ నిర్వహించనున్నామని ఈ పశుయాత్రలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పొత్తూరి రామరాజు కోరారు.

## మిగులు భూములు దళితులకు పంచాలి: సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ రఘు



గుడివాడ : ప్రభుత్వం గతంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోట్టుకుని మిగులు భూములను దళితులకు పంపిణీ చేయాలని సిపియం జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.రఘు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కామేద్రు సందరయ్య భవనంలోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత క్యాబినెట్ సమావేశంలో 8వ విడత భూ పంపిణీ కార్యక్రమంలో దళితులకు 80000 ఎకరాలను పంపిణీ చేస్తామని హామీ ఇచ్చి నేటి వరకు అది అములు చేయాలేదన్నారు. బడా బాబులు చేతులో వేల ఏకారాల అసైన్డ్ భూములు ఉన్నప్పటికి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కొంతమంది నకిలీ పట్టాలు సృష్టించి దళితులకు అందకుండ కోర్టులో కేసులు వేసి పెత్తనం చేలయిస్తునరన్నారు. 19/71 చట్టం ప్రకారం భూ పంపిణీ చేయాలన్నారు. సొసైటీ భూములను ఎవరికి వారికే అప్పగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందన్నారు. దళితుల కోసం ఎన్నో పోరాటలు చేసిన నిజమైన లబ్ధిదారలుకు న్యాయం జరగడంలేదన్నారు. అక్రమంగా భూములను దోచుకున్న బడా బాబుల నుండి వాటిని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. కుదరవల్లి, పోలుకొండ, ఇల్లపర్రు, మోపిదేవి, తదితర ప్రాంతాలలో భూములను పెత్తనదారులే అనుభవిస్తునరన్నారు. అసైన్డ్ భూమి పట్ల ప్రభుత్వం స్పష్టమైన వైఖరిని తెలపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రచారంలో మాత్రం పేదవర్గలకు భూమిని పంపిణి చేస్తామాని అర్పాటాలు చేయడం తప్ప కార్యరూపం దాల్చలేదన్నారు. ప్రభుత్వం ఇదే ధోరణి అవలంబిస్తే భూ పోరాటాలను మరింత ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపియం డివిజన్ కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహాశక్తి ప్రారంభోత్సవ కార్యక్రమానికి నరసరావుపేట తెలుగు మహిళల ప్రయాణం



పల్నాడు జిల్లా .నరసరావుపేట .జూలై 14 (ప్రజా పాలన ప్రతినిధి): నరసరావుపేట తెలుగు మహిళలు తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహాశక్తి కార్యక్రమానికి శుక్రవారం నాడు నరసరావుపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్-ఛార్జ్ డా.చదలవాడ అరవింద బాబును కలిసి ప్రయాణానికి సిద్ధమయ్యారు.తెలుగు మహిళల ప్రయాణానికి నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-చార్జ్ డా??చదలవాడ అరవింద బాబు పచ్చ జెండా ఊపి తెలుగు మహిళల ప్రయాణాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా డా.చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ..........తెలుగు మహిళల మహాశక్తి కార్యక్రమం వైసీపీ అవినీతి,అక్రమాలను అంతమొందించే ఆదిపరాశక్తి అవుతుందన్నారు.రాష్ట్రంలో మహిళల పైన అనుచిత వ్యాఖ్యలు చేసి,అత్యాచారాలు చేసిన వైసీపీ నాయకుల అధికార మదాన్ని అణిచివేయడానికి ప్రతి మహిళ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.మహాశక్తి కార్యక్రమం మహిళలను ఆర్థిక,సామాజిక,రాజకీయ రంగాలలో అగ్రగామిగా నిలుపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.మహిళా సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ ఎప్పుడు ముందుంటుందని చంద్రబాబు నాయుడు డ్వాక్రా సంఘాలు ఏర్పాటుతో మహిళలకు ఆర్థిక చేయూతను అందించారన్నారు.నందమూరి తారక రామారావు మహిళలకు ఆస్తిలో సమాన వాటా చట్టం తెచ్చారని గుర్తు చేశారు.మహిళలను అగ్రగామిగా నిలిపే తెలుగుదేశం పార్టీ విజయంలో తెలుగు మహిళా విభాగం కీలక భూమిక పోషించాలన్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ మహిళా నాయకులు దాసరి ఉదయశ్రీ,కనుమూరి లక్ష్మి,క్రోసూరి రాధికా,కదం నాగజ్యోతి,కొండ్రగుంట లక్ష్మి,చావా నాసరమ్మ,మస్తాన్ బి,అమీరున్,ఉడత రాజ్యలక్ష్మి,వెంకాయమ్మ,లక్ష్మీ,లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## నవధాన్యాలు సాగు చేద్దాం-నేల తల్లికి జీవం పోద్దాం!

**పల్నాడు జిల్లాప్రాజెక్టు మేనేజర్ కె.అమల కుమారి**



పల్నాడు జిల్లా .నరసరావుపేట. జూలై 14 (ప్రజా పాలన ప్రతినిధి): నవధాన్యాల పంటలను సాగు చేయుటం వలన భూమాతకు జీవం పోసినట్లే పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె .అమల కుమారి అన్నారు. శుక్రవారం వినుకొండ మండలంలోని ఏనుగుపాలెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానం చేస్తున్న పంటపొలాలను పరిశీలించి ప్రకృతి వ్యవసాయ రైతులు సిబ్బందితో నవధాన్యాల సాగుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని 10 ఎకరాల విస్తీర్ణంలో సామూహికంగా 30 రకాల విత్తనాలను బీజామృతంతో విత్తన శుద్ధిచేసి చల్లడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంలో పంట దిగుబడులు పెంచేందుకు గాను నేలలో సూక్ష్మ జీవులు వృద్ధి చెందటానికి పోషకాలు తగిన మోతాదులో పెరగటానికి నేలలో నీటి సంగ్రహణ శక్తి పెరిగి వర్షాభావ పరిస్థితుల్లో పంటలో సాగుకు అనువైన వాతావరణాన్ని ఏర్పరచడానికి మరియు నేలతల్లికి జీవనం పోసి అతి తక్కువ ఖర్చుతో వేసవి తాపాన్ని తట్టుకొని సంవత్సరమంతా పచ్చని పైర్లు తో భూమి విల సిల్లి లాభసాటి చేసేందుకు రైతులు అందరూ ఆచరించే విధానమే నవధాన్య సాగు పద్ధతిని తెలియజేశారు. ప్రధాన పంట వేసే ముందు13 కేజీల నవధాన్యాలు పంటలు రైతులు సన్నద్ధం చేయాలని బీజామృతంతో విత్తన శుద్ధి చేసిన నవధాన్య విత్తనాలను పొలంలో వెదజల్లి 45 రోజులు కాలం వ్యవధిలో పెరిగిన నవధాన్య పంటలను పశువుల మేత కొరకు పశువులకు వదలాలి లేదా భూమిలో కలయిదున్నటం వల్ల భూమి కి జీవవైవిధ్యం పెరిగి ప్రధాన పంటకు కావలసిన పోషకాలు అంది పంట దిగుబడి పెరిగి రైతన్నలకు ఆదాయం సమకూరుస్తుందని అన్నారు.

నవ ధాన్యాల పంటలు అనగా

1. పచ్చిరొట్ట (జీలగ,జనుము ,పిల్లి పెసర)2. పప్పు జాతి (మినుములు ,పెసర ,బొబ్బర్లు చిక్కుడు) 3. నూనె జాతి (నువ్వులు, ఆముదం, వేరుశనగ)4. సుగంధ జాతి (ధనియాలు మెంతులు, ఆవాలు)5. ధాన్యపు జాతి (రాగులు మొక్కజొన్న ,కొర్రలు, సామలు) ఇతర తీగజాతి అనప, దోస ,టమోటా, ముల్లంగి ,మరియు పూల జాతి బంతి ఇతర పంటల విత్తనాలు సేకరించుకొని వారి పంట పొలంలో చల్లడం ద్వారా తీగజాతి కూరగాయల పంటలు 25 రోజుల నుండి పంటకోతకు వస్తాయి తద్వారా రైతులకు అదనపు ఆదాయం మరియు ఆహార భద్రత కూడా కలుగుతుంది అదేవిధంగా పచ్చి గడ్డి పశువులకు నవధాన్యాల పంటలో వేయటం వలన పాలు దిగుబడి పెరిగి వెన్న శాతం కూడా అధికంగా ఉంటుందని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏ అప్పలరాజు, యూనిట్ ఇంచార్జ్ వినుకొండ బేబీ రాణి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## హోమ్ గార్డుల ఐకమత్యం భేష్: పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్ రెడ్డి ఐపిఎస్



పల్నాడు జిల్లా. నరసరావుపేట .జూలై 14 (ప్రజాపాలన ప్రతినిధి): హోమ్ గార్డుల ఐకమత్యం భేష్ అని పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్ రెడ్డి ఐపిఎస్ అన్నారు. ఉద్యోగ విరమణ పొందిన హోమ్ గార్డు కు జిల్లాలోని అందరి హోంగార్డుల ఒకరోజు వేతనం రూ. 5,17,590/– ఆర్థిక సాయం. పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్ రెడ్డి ఐపిఎస్ చేతుల మీదుగా సదరు చెక్కు అందజేత. హోమ్ గార్డులను అభినందించిన జిల్లా ఎస్.పి . నరసరావుపేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తూ ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన హోమ్ గార్డు U.CH. పాపయ్య కి తోటి హోమ్ గార్డులు అండగా నిలిచారు. జిల్లాలోని హోమ్ గార్డులు అందరూ ఒక రోజు వేతనం రూ. 5,17,590/– సాయం చేసారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఈ రోజు అనగా 14.07.2023 న రూ. 5,17,590/– చెక్కును జిల్లా ఎస్.పి వై.రవిశంకర్ రెడ్డి ఐపిఎస్ చేతుల మీదుగా అందజేశారు. సాటి హోమ్ గార్డు కు సాయం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన హోమ్ గార్డులను జిల్లా ఎస్.పి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎ .ఆర్ అదనపు ఎస్.పి డి. రామచంద్ర రాజు, ఆర్.ఐ లు వై. రవి కిరణ్ , రమణ పాల్గొన్నారు.

## కేంద్రప్రభుత్వం సీడ్ సంక్షేమ పథకం ద్వారా నిధులను వెంటనే విడుదల చేయాలి



పల్నాడు జిల్లా. రెంటచింతల .జూలై 14( ప్రజా పాలన ప్రతినిధి): కేంద్ర ప్రభుత్వం సంచారజాతుల ఆర్థిక అభివృద్ధి కోసం సీడ్ పథకం ద్వారా వెంటనే నిధులు విడుదల చేయాలని అఖిల భారత సంచార జాతుల అభివృద్ధి మండలి పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు అన్నపురెడ్డి సాంబశివరావు డిమాండ్ చేశారు దేశవ్యాప్తంగా ఉన్న సంచార జాతుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం డిఎన్టి డెవలప్మెంట్ బోర్డును ఏర్పాటు చేసి ఐదు సంవత్సరాలు పూర్తి అయినప్పటికీ నేటికీ ఒక్క రూపాయి కూడా కేంద్ర ప్రభుత్వం విడుదల చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు డిఎన్టి బోర్డు ద్వారా సంచార జాతుల ఆర్థిక అభివృద్ధి కోసం సీడ్ పథకం ఏర్పాటు చేసి ఈ సీడ్ పథకం ద్వారా ఆన్లైన్ దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారికి రుణాలను విడుదల చేస్తామని ప్రకటన చేయటంతో అనేకమంది సంచార జాతులు వారు ఎంతోమంది ఆశతో ఆన్లైన్ దరఖాస్తు చేసుకున్నారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పదివేల మందికి పైగా దేశవ్యాప్తంగా ఐదు లక్షల మందికి పైగా ఎంతో కష్టపడి ఆఫీసుల చుట్టూ తిరిగి అప్లికేషన్స్ సర్టిఫికెట్స్ తెచ్చుకొని దరఖాస్తు చేసుకున్నారు దరఖాస్తు చేసుకున్న డిఎన్టీలు సుమారు రెండు సంవత్సరాల నుండి ఎదురుచూస్తున్నారు .

## జగన్ అవినీతి ప్రభుత్వాన్ని సాగనంపుదాం: రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ పిలుపు



గోకవరం జులై 14 ప్రజా పాలన ప్రతినిధి: మండలం కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ గ్రామంలో ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్తూ భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలు పంపిణీ చేస్తూ జగన్ రెడ్డి చేస్తున్న అరాచక పాలన ప్రజలకు వివరిస్తున్నానన్నారు. ఈ రాష్ట్రంలో అరాచక పాలన వల్ల జనం విలవిలాడుతున్నారని ఈ అవినీతి ప్రభుత్వాన్ని త్వరలో ఇంటికి సాగనంపడానికి జనం ఎదురుచూస్తున్నారని తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోతో రాష్ట్రం ప్రజలకు భవిష్యత్తు గ్యారెంటీ ఇస్తూ అనేక పథకాలను రూపొందిస్తున్నామని మహిళలకు, రైతులకు, అణగారిన వర్గాలకు బీసీలకు, ఎస్సీలకు, అన్ని వర్గాల వారికి న్యాయం చేసే మేనిఫెస్టో తెలుగుదేశం పార్టీ అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గోకవరం మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు కొత్తపల్లి గ్రామ టిడిపి నాయకులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మంగరౌతు. రాము. క్లస్టర్ ఇంచార్జ్ లు ఉంగరాల రాము. అడపా భరత్ బాబు,నున్నం రాంబాబు.దిండి రాజు, మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## మంత్రి తమ్ముడిపై చర్యలు తీసుకోవాలి: సీపీఐ నాయకుల ధర్నా




కర్నూలు ప్రజాపాలన ప్రతినిధి:కర్నూలు నగరంలోని 17వ వార్డులో మంత్రి ఆదిమూలపు సురేశ్ సోదరుడు ఆదిమూలపు సతీశ్ స్థలం ఆక్రమించారని.. రహదారి కబ్జా చేసి తమ తల్లిదండ్రుల విగ్రహాలు ఏర్పాటు చేశారని.. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జగన్నాథం డిమాండ్ చేశారు. కర్నూలు నగరపాలక కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేశారు. సామాన్యుల విషయంలో చర్యలు తీసుకునే అధికారులు మంత్రి తమ్ముడి వ్యవహారంలో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. వెంటనే చర్యలు తీసుకోకపోతే ఉద్యమాలను ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేష్, శ్రీనివాసరావు, శ్రీనివాసులు, బీసన్న, నల్లన్న పాల్గొన్నారు.

## రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్ ఫెడరేషన్(ఆర్ పి ఎస్ ఎఫ్) బి.సి బాయ్స్ హాస్టల్ కమిటీ ఎన్నిక



ఆదోని ప్రజాపాలన ప్రతినిధి: ఆదోని పట్టణంలో రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్ ఫెడరేషన్(ఆర్ పి ఎస్ ఎఫ్) నూతన కమిటీని రాష్ట్ర ఉపాధ్యక్షులు నవీన్ కుమార్,జిల్లా కార్యదర్శి బాలు,డివిజన్ అధ్యక్షులు ప్రదీప్,కార్యదర్శి వంశీ ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా రాయలసీమలోని విద్య వెనుకబాటుతనం గురించి ప్రదీప్,జిల్లా కార్యదర్శి బాలు, సహాయ వంశీ మాట్లాడుతూ చదువుకోవాలని ఆసక్తి ఉన్న విద్యార్థులు, చదువు పూర్తి చేసుకున్న విద్యార్థులు వలసలు వెళ్లే పరిస్థితి ఏర్పడ్డాయి అని ఒక విద్యారంగమే కాదు అన్ని రంగాలలో రాయలసీమ ఎప్పుడు అదమ స్థానంలోనే ఉంది ఇక్కడ విద్యారంగం కుంటుపడడానికి పాలకుల నిర్లక్ష్యమే అతి పెద్ద కారణం. అందుకోసమే రాయలసీమలోని విద్యార్థుల ను దృష్టిలో ఉంచుకొని రాయలసీమకు రావాల్సిన హక్కులు శ్రీబాగ్ ఒప్పందం మరియు నీటి సదుపాయాలు రాయలసీమ సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేయాలి లేనియెడల రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆర్.డి.యస్ కుడి కాలువను 8 టి.ఎం.సి ల కొరకు,నీళ్లు, నిధులు,విద్య,వైద్యం కోసం పోరాటానికి సన్నద్ధమయామని రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్ ఫెడరేషన్(ఆర్ పి ఎస్ ఎఫ్) బి.సి బాయ్స్ హాస్టల్ కమిటీ ఎన్నిక సందర్భంగా హాస్టల్ అధ్యక్షుడు జాన్,రాకేష్ పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ హాస్టళ్లకు సొంత భవనాలు కేటాయించాలి అలాగే మైనింగ్ కళాశాల నిర్మించాలి అని,ప్రభుత్వ విద్యా సంస్థలు నెలకొల్పాలి అని పిలుపునిస్తూ రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్ ఫెడరేషన్ నూతన కమిటీని 20 మంది విద్యార్థులతో కమిటీని ఎన్నిక చేశారు.కమిటీ సభ్యులు లోకేష్,మహేష్,రవి,సాయి శివ,అశోక్,రవి,నబి రసూల్ తదితరులు ఉన్నారు.

## కిర్లంపూడి సెంటర్ లో జనసేన సైనికుల నిరసన పవన్ కళ్యాణ్ ఫోటోకి పాలాభిషేకం, జగన్ ఫోటో దగ్ధం



జగ్గంపేట ప్రజా పాలన ప్రతినిధి.మొన్న కిర్లంపూడి సెంటర్ లో వై సీ పి ప్రభుత్వ నాయకుల నిరసనలకు బదులుగా కిర్లంపూడి సెంటర్ లో జనసేన సైనికుల నిరసన పవన్ కళ్యాణ్ ఫోటోకి పాలాభిషేకం, జగన్ ఫోటో దగ్గం చేసి ప్రభుత్వ మద్దతిదారుల నిరసనలకి సమాధానం చెప్పిన జనసేన జగ్గంపేట నియోజకవర్గ శ్రేణులు వాలంటరీలంతా ఒకసారి వై.సీ.పీ. నాయకులు వాళ్ళు జారీ చేసే ఆర్డర్లు పక్కన బెట్టి జనసేన అధినేత ఎం మాట్లాడారో క్షున్నంగా పరిశీలించాలన్నారు యువతని వాలంటరీ పేరుతో వారి భవిష్యత్తుని, అభివృద్ధిని అడ్డుకుంటున్న ఈ ప్రభుత్వంలో ఉన్న నాయకుల మాటలు నమ్మొద్దన్నారు సొంత జేబులో డబ్బులు ప్రజలకి దానంచేసే పవన్ కళ్యాణ్ ఎక్కడా ప్రజాధనంతో తన సొంత సాక్షి పేపర్ కొనిపించే ఈ వై.సీ.పి ముఖ్యమంత్రి ఎక్కడ అని హేళ్ళన చేసారు ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బుదిరెడ్డి శ్రీనివాస్, నియోజకవర్గనాయకులు పాలిశెట్టి సతీష్, కిర్లంపూడి మండలఅధ్యక్షులు ఉలిశి అయిరాజు, మండల యం. పి. టి.సి గోకాడ రాజా, ఉపాధ్యక్షులు గంధంప్రభాకర్, జిల్లాప్రోగ్రమింగ్ కమిటీ దేగల విజయ్ కుమార్, మండల అధికారప్రతినిది పాతిరెడ్డి శేఖర్, ఎలుబండి శివ, సాయి మండల మరియు గ్రామ జనసైనికులు పెద్దఎత్తున పాల్గొన్నారు

## గడపగడపకు -మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్ రావు



వీరులపాడు జూలై 14 ప్రజా పాలన ప్రతినిధి: మండ లంలోని పల్లెంపల్లి గ్రామంలో గడపగడపకు -మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శాసనసభ్యులు డా క్టర్ మొండితోక జగన్ మోహన్ రావు శుక్రవారం ప్రతి గడ పకు వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథ కాలను వివరిస్తూ - ప్రజల సమస్యలనుఅడిగి తెలు సుకున్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం బలహీన వర్గాలకు అండగా నిలుస్తుందని.. వారి జీవి తాలకు భరోసా కల్పిస్తూ.సంక్షేమ పథకాలను అమ లు చేస్తున్నట్లు తెలిపారు. వైయస్ జగన్ నా ఎస్టీ, నా ఎస్సీ, నా బీసీ, నా మైనారిటీ లు అంటూ వారిని సొం త కుటుంబ సభ్యుల మాదిరిగా పరిగణిస్తూ మా ట్లాడతారని గుర్తు చేశారు. బలహీన వర్గాలకు వైయస్సా ర్ కాంగ్రెస్ పార్టీ వెన్నుదున్నుగా నిలుస్తుందని చెప్పారు.జగనన్న ప్రభుత్వంలో అన్ని వర్గాల.అన్ని రం గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. ప్రజలకు మంచి చేస్తున్న ప్రభుత్వం కాబట్టే ధైర్యంగా ప్రజల ఇం టి ముందుకు వెళ్లి మా ప్రభుత్వం చేస్తున్న మంచి ఇది అని సగర్వంగా చెబుతున్నామన్నారు ఈ కార్యక్రమం లో స్థానిక ప్రజాప్రతినిధులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లు, సచివాలయ సి బ్బంది తదితరులు పాల్గొన్నారు

## భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య



జగ్గయ్యపేట జూలై 14 ప్రజా పలన ప్రతినిధి:భవిష్య త్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా పట్టణం 8వ వా ర్డు తొర్రగుంటపాలెంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మేక వెంకటేశ్వర్లు చిలుకూరి కార్తీక్ ఆ ధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వ హించారు ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ ఇన్చార్జి శ్రీ శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన వార్డు ప్రజలకు భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందజేసి వి వరించారు ఈ కార్యక్రమంలోమేక వెంకటేశ్వర్లు, మై నేని రాధాకృష్ణ, నకిరకంటి వెంకట్, పేరం సైదేశ్వర రావు, , గవిని శ్రీను, రావెళ్ళ రమేష్, షేక్ మౌలాలి త దితరులు పాల్గొన్నారు

## జగనన్న పాలనలో అన్ని సంక్షేమ పథకాలు ప్రజల ఇంటి ముంగటే :ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్ రావు



చందర్లపాడు జూలై 14 ప్రజాపాలన ప్రతినిధి మండల పరిధిలోని వెలది కొత్తపాలెం కాసరబాధ గ్రామాలలో జగనన్న సురక్ష క్యాంపులను ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్ రావు పాల్గొని అర్జీదారులకు సంబంధిత ధ్రువపత్రాలను అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనలో అ న్ని సంక్షేమ పథకాలు ప్రజల ఇంటి వద్దకే వచ్చి అం దిస్తున్నారని ఆయన తెలిపారుసంక్షేమ పథకాలకు అర్హులను గుర్తించి దరఖాస్తు చేయించడం. ఆపద స మయాల్లో అండగా నిలవడం ఒకటో తేదీ తెల్లవారు జామునే అవ్వ తాతల తలుపు తట్టి పింఛను డబ్బు చేతికి అందించి వారి ఆశీస్సులు పొందుతున్న వాలం టీర్ల పనితీరు అభినందనీయం అన్నారుజగనన్న సు రక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవా లనిసర్టిఫికెట్ల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా దరఖాస్తు చేసుకున్న వెంటనే.. వారికి సత్వరమే సర్టిఫికెట్లు అందేలా రాష్ట్ర ప్రభుత్వం జ గ నన్న సురక్ష ను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందన్నారు ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికా రులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## తెదేపాను గెలిపించేందుకు ఎన్నారైలు నడుం కట్టాలి




నరసాపురం, జూలై 14 (ప్రజాపాలన ప్రతినిధి) : రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెదేపా పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ టి. దశరథ జనార్దన్, పశ్చిమ గోదావరి జిల్లా జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు, పుత్తూరు తెదేపా ఇంచార్జి గాలి భానుప్రకాష్ చిత్తూరు పార్లమెంట్ అధ్యక్షుడు పులివర్తి నాని లు అన్నారు. అమెరికాలోని చార్లెట్ నగరంలో శుక్రవారం తెలుగుదేశం పార్టీ అభిమానుల ఆధ్వర్యంలో మీట్ విత్ గ్రేట్ కార్యక్రమం నిర్వహించారు. నరసాపురం నియోజకవర్గ తెదేపా సీనియర్ నాయకుడు కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జనార్దన్, బాపిరాజు, ప్రకాష్, నానిలు ముఖ్య అతిథిలుగా పాల్గొని మాట్లాడుతూ ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడులు తీసుకువచ్చిన ప్రభుత్వ పథకాలు, ఇంజనీరింగ్ కళాశాలల వల్ల యువత బాగా చదువుకొని అమెరికా తదితర అభివృద్ధి చెందిన దేశాలలో స్థిరపడ్డారని అన్నారు. 2024 ఎన్నికలను లక్ష్యంగా పెట్టుకోవాలని దిశానిర్దేశం చేసారు. ఎన్టీఆర్ సినీ జీవితంలోనే కాదు నిజ జీవితంలో కూడా హీరోనని అన్నారు. తెలుగుదేశం పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లిన విధానం, రాజకీయ విలువలు, చంద్రబాబు నాయుడు చేసిన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అభివృద్ధి, పారదర్శక పరిపాలన తదితర విషయాలపై వారు మాట్లాడారు. తెలుగుదేశం పార్టీని 2024లో తిరిగి అధికారంలోకి తీసుకు వచ్చేందుకు చంద్రబాబుని మళ్ళీ ముఖ్యమంత్రిని చేసేందుకు ఎన్నారైలు నడుంకట్టి వ్యూహాత్మకంగా ఇండియాలో ఉన్న తమవారిని సన్నద్ధం చేయాలని ఎన్నారై టీడీపీ కార్యకర్తల్లో వారు స్ఫూర్తిని నింపారు.

## రైలు పునరుద్ధరణ కొరకు ఎంపీకి బండారు వినతి



నరసాపురం, జూలై 14 (ప్రజాపాలన ప్రతినిధి) :గత నెల 19 వ తేదీనుండి నిలిపివేసిన నరసాపురం - గుంటూరు (17282) పాస్ట్ ప్యాసింజర్ రైలును విజయవాడ వరకు నడిపే విధంగా చర్యలు తీసుకోవాలని నరసాపురం ఎంపీ కనుమూరి రఘురామకృష్ణంరాజుకు నరసాపురం మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు వినతిపత్రం అందజేశారు. నరసాపురం - గుంటూరు ( నెం 17282) పాస్ట్ ప్యాసింజర్ రైలును విజయవాడల గుంటూరుల మధ్య ట్రాక్ మరమ్మత్తుల నిమిత్తం జూన్ 19 నుండి నిలుపుదల చేశారని ఈ రైలులో వందలాది మంది ప్రజలు, చిరు వ్యాపారులు, విద్యార్థులు, విజయవాడలో చికిత్స నిమిత్తం నరసాపురం పరిసర ప్రాంతాల నుండి ప్రజలు నిత్యం ప్రయాణం సాగిస్తుంటారని ఈ రైలును రద్దు చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ సమస్యను దృష్టిలో ఉంచుకొని గుంటూరు పాస్ట్ ప్యాసింజరు రైలును ప్రస్తుతానికి విజయవాడ వరకు నడిపే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపి రఘురామ కృష్ణంరాజుకు బండారు మాధవనాయుడు వినతిపత్రం సమర్పించారు. దీనిపై ఎంపీ స్పందిస్తూ రైల్వేశాఖ అధికారులతో సంప్రదించి గుంటూరు పాస్ట్ ప్యాసింజర్ విజయవాడ వరకు నడిచేలా చర్యలు తీసుకోవాలని కోరతామని తెలిపారు.

## జగ్గంపేట వాలంటీర్స్ ఆర్థిక సాయం



జగ్గంపేట ప్రజాపాలన ప్రతినిధి.జగ్గంపేట వాలంటీర్ కుటుంబంలో ఒకరు అయిన రక్కిసు మల్లీశ్వరి ఇటీవలే ప్రమాదానికి గురి అయిన విషయం అందరికి తెలిసిందే..అయితే ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతూండటం వల్ల జగ్గంపేట వాలంటీర్స్ అందరూ మంచి మనసుతో ముందు కు వచ్చి ఆ కుటుంబానికి 11,100 రూపాయిలు ఆర్థిక సాయం చేయటం జరిగింది.ఈ సహాయ నిమిత్తం జగ్గంపేట వాలంటీర్స్ మరియు సచివాలయం సిబ్బంది మరియు జగ్గంపేట ఎంపీటీసీ ఆకుల శ్రీధర్ మరియు జగ్గంపేట వైయస్సార్ సేవాదల్ కన్వీనర్ కీలపర్తి వీరబాబు మరియు ఇతరులు వీరందరి సహాయ సహకరాలతో ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం చేయటం తో పాటు మేము ఉన్నాం అని భరోసా ఇవ్వటం జరిగింది.

## జనసేన కార్యదర్శి కొట్టేసాయి చేతివాటం ప్రదర్శించటంపై మండిపాటు



ప్రజాపాలన న్యూస్ శ్రీకాళహస్తి :తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి జనసేన కార్యదర్శి అయినటువంటి కొట్టేసాయి గారిని వన్ టౌన్ సీఐ అంజు యాదవ్ గారు పబ్లిక్ లో తన చేతివాటాన్ని ప్రదర్శించడాన్ని ఖండిస్తూ , ఆంధ్ర రాష్ట్ర పోలీస్ వ్యవస్థకు మచ్చ తెచ్చే విధంగా నడుచుకుంటున్న సీఐ అంజు యాదవ్ గారిపై వెంటనే చట్టరీత్యాచార్యులు తీసుకోవాలని జై భీమ్ ఆర్మీ తరపున డిమాండ్ చేస్తున్నాము. కొట్టే సాయి గారికి న్యాయం జరిగేంత వరకు అండగా ఉంటామని మా జై భీమ్ ఆర్మీ తరఫున పూర్తి మద్దతు తెలియజేస్తున్నాము .ఈ కార్యక్రమంలో జై భీమ్ వ్యవస్థాపకులు పులి శ్రీకాంత్, జై భీమ్ ఆర్మీ లీగల్ అడ్వైజర్ పుష్పలత గారు, పట్టణ అధ్యక్షులు కన్నలి రమేష్ ,కుంపటి చలపతి, తలిశెట్టి సాయి తదితరులు పాల్గొన్నారు.....

## డి ఎం సారు ఆర్టీసీ బస్టాండ్ లో ఉన్న సమస్యలను పరిష్కరించండి



ప్రజాపాలన న్యూస్ శ్రీకాళహస్తి శ్రీకాళహస్తి..ఆర్టీసీ బస్టాండ్లో సామాన్య ప్రయాణికుల పరిస్థితి అగమ్య గోచరంగా మారుతుందని స్థానిక ప్రయాణికులు వాపోతున్నారు.ఆర్టీసీ బస్టాండ్లో కనీస భద్రత లేదని విద్యార్థులకు అడ్డాగా మారుతుందని.. కనీసం కొన్ని ఫ్యాన్లు మరమత్తులైన బాగు చేయలేని పరిస్థితుల్లో ఆర్టీసీ బస్టాండ్ లోసమస్యలు నెలకొని ఉన్నాయని.. సమస్యలు పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఇక బస్టాండ్ లో ఉన్న బాత్రూంలు పరిస్థితి చూస్తే కుళాయిలు కూడా సక్రమంగా పనిచేయడం లేదని వాపోతున్నారు. ఇకనైనా ఆర్టీసీ అధికారులు స్పందించి బస్టాండ్లో ప్రయాణికుల సౌకర్యార్థం సౌకర్యాలు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## విజయవాడలో ఉపా, ఎన్ ఐ ఏ లను రద్దు చేయాలని ధర్నా చౌక్ లో జరిగే మహాధర్నాను విజయవంతం చేయండి



పల్నాడు జిల్లా .నరసరావుపేట. జూలై 14 (ప్రజాపాలన ప్రతినిధి.):ఉపా, ఎన్ఐఏ లను రద్దు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూ 15-7-2023 ఉదయం 10 గంటలకు విజయవాడ ధర్నా చౌక్ లో జరిగే మహా ధర్నా ను విజయవంతం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ 14-7-2023 నరసరావుపేట ఎన్ జి ఓ హెూం లో జరిగిన కరపత్రాల ఆవిష్కరణ. ఈకార్యక్రమంలో కంబాల ఏడుకొండలు, శిఖనం సాంబయ్య (ప్రగతిశీల కార్మిక సమాఖ్య) సిలార్ జక్కా బ్రహ్మయ్య (కులనిర్మూలనా పోరాట సమితి) జై భీమ్ భారత్ పార్టీ నరసరావుపేట నియోజకవర్గం ఇంచార్జ్ గోదా జాన్ పాల్,గేరపాటి మోహన్ రావు జై భీమ్ భారత్ పార్టీ మాల మహానాడు పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు కోండ్రు విజయ్,దార్ల యర్రయ్య మాలమహానాడు వినుకొండ గౌరవాధ్యక్షులు ,కూచిపూడి రమేష్ (దళిత సంక్షేమ సంఘం) కోటా రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

# నాని 'హాయ్ నాన్న'
## ఫస్ట్ గింప్స్ కి సూపర్ రెస్పాన్స్




నాచురల్ స్టార్ నాని హీరోగా యువ దర్శకుడు శౌర్యూవ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న లేటెస్ట్ మూవీ హాయ్ నాన్న. సీతారామం ఫేమ్ మృణాల్ ఠాకూర్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ మూవీలో నాని కూతురుగా బేబి కైరా ఖన్నా నటిస్తోంది. ఈ సినిమాను వైరా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై మోహన్ చెరుకూరి, డాక్టర్ విజేందర్ రెడ్డి తీగల, మూర్తి కేఎస్ గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. మలయాళ చిత్ర పరిశ్రమకు చెందిన హేశమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా డిసెంబర్ 21న విడుదల కానుంది. అలానే ఈ సినిమాని తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల చేయనున్నారు. విషయం ఏమిటంటే నేడు ఈ మూవీ యొక్క టైటిల్ ఫస్ట్ గ్లింప్స్ ని విడుదల చేసారు మేకర్స్. కాగా ఈ గ్లింప్స్ ఇప్పటికే 3 మిలియన్ కి పైగా వ్యూస్ ని సొంతం చేసుకుని ఆడియన్స్ లో మంచి క్రేజ్ తో కొనసాగుతోంది. మరి అందరిలో బాగా హైప్ ఏర్పరిచిన హాయ్ నాన్న మూవీ రిలీజ్ తరువాత ఎంత మేర సక్సెస్ అందుకుంటుందో చూడాలి.

## ఫస్ట్ టైం సింగర్ గా విశాల్..



కోలీవుడ్ యాక్షన్ హీరో విశాల్ హీరోగా చేస్తున్న లేటెస్ట్ చిత్రాల్లో ఇంట్రెస్టింగ్ గ్యాంగ్ స్టర్ యాక్షన్ డ్రామా "మార్క్ ఆంథోని" కూడా ఒకటి. దర్శకుడు ఆధిక్ రవిచంద్రన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం అయితే రీసెంట్ గానే రిలీజ్ డేట్ ని కూడా ఫిక్స్ చేసుకోగా ఈ సినిమాపై లేటెస్ట్ గా ఇంట్రెస్టింగ్ అప్డేట్ అయితే వచ్చింది. మరి దీనితో ఈ సినిమా కోసం మొట్ట మొదటిసారి అందులోని తెలుగు సాంగ్ ని అయితే విశాల్ ఆలపించడం విశేషం. అదరద మామ అనే సాంగ్ అయితే అయితే విశాల్ లేటెస్ట్ గా పాడగా ఈ న్యూస్ ని తాను షేర్ చేసుకున్నాడు. ఇక ఈ సాంగ్ ఫుల్ సాంగ్ అయితే ఈ జూలై 15న మేకర్స్ రిలీజ్ చేయనున్నారు. అయితే తన కెరీర్ లో ఇన్నేళ్ళలో మొదటి సాంగ్ ని విశాల్ పాడగా ఇది వైరల్ గా మారింది. ఇక ఈ చిత్రానికి అయితే జివి ప్రకాష్ సంగీతం అందించగా ఈ సెప్టెంబర్ 15న వినాయక చవితి కానుకగా సినిమా తెలుగు తమిళ్ భాషల్లో రిలీజ్ కాబోతుంది.

# 'బేబీ' పై రౌడీకి భలే నమ్మకం



ఆనంద్ దేవరకొండ.. వైష్ణవి.. విరాజ్ ముఖ్య పాత్రల్లో నటించిన 'బేబీ' సినిమా నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. జూనియర్ రౌడీ స్టార్ ఆనంద్ దేవరకొండ 'బేబీ' సినిమా ప్రమోషన్స్ లో ఎక్కడ చూడా రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ కనిపించడం లేదు ఏంటో అంటూ మీడియా లో అభిమానుల్లో చర్చ జరిగిన విషయం తెల్సిందే. ఎట్టకేల కు రౌడీ స్టార్ కనిపించాడు. నిన్న ఈ సినిమా ప్రీ మియర్ షో ను ప్రసాద్ మల్టీ ప్లెక్స్ లో వేయడం జరిగింది. చిత్ర యూనిట్ సభ్యుల తో పాటు రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ ప్రీమియర్ షో కి హాజరు అయ్యాడు. షో పూర్తి అయిన తర్వాత సినిమా గురించి స్పందించేందుకు నిరాకరించాడు. ప్రస్తుతానికి సినిమా గురించి ఏమీ చెప్పను... కానీ నటీ నటులు నన్ను ఏడిపించారు అంటూ కామెంట్ చేశాడు. సినిమా గురించి మూడు నాలుగు రోజుల తర్వాత మాట్లాడుతా ను అన్నట్లుగా రౌడీ స్టార్ పేర్కొన్నాడు. సినిమా ఎలాగూ సూపర్ హిట్ అవ్వడం ఖాయం.. మూడు నాలుగు రోజుల తర్వాత భారీ ఎత్తున ఒక సక్సెస్ మీట్ ను ఏర్పాటు చేస్తారు అప్పుడు మాట్లాడుతా ను అన్నట్లుగా విజయ్ దేవరకొండ వ్యాఖ్యలు ఉన్నాయి అంటూ సోషల్ మీడియా లో కొందరు చర్చించుకుంటున్నారు. ఈసారి తమ్ముడు ఆనంద్ దేవరకొండ బేబీ సినిమాతో యూత్ తో పాటు అన్ని వర్గాల వారి ని కూడా ఆకట్టుకుంటాడు అనే నమ్మకంతో విజయ్ దేవరకొండ ఉన్నట్లుగా ఆయన మాటల ను చూస్తే అర్థం అవుతుంది. ఇప్పటికే ప్రీమియర్ షో టాక్ పాజిటివ్ గా ఉండటంతో రెగ్యులర్ ప్రేక్షకుల నుండి ఎలాంటి స్పందన వస్తుందా అనేది అందరి లో ఆసక్తి రేకెత్తిస్తోంది. బేబీ సినిమా లో ఒక విభిన్నమైన ప్రేమ కథ ను చూపించబోతున్నారు. యూత్ ఆడియన్స్ కచ్చితంగా ఈ ప్రేమ కథ కు కనెక్ట్ అవుతారు అంటూ దర్శక నిర్మాతలు చాలా నమ్మకంగా ప్రమోషన్ కార్యక్రమాల్లో చెప్పారు. ఇక ఆనంద్ దేవరకొండ ఈ సినిమా లో నటుడిగా మరింత మంచి పేరు దక్కించుకుంటాడనే నమ్మకం వ్యక్తం అవుతోంది. మరికొన్ని గంటల్లో సినిమా పూర్తి రివ్యూలు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

## శ్రీలీల అప్పుడే వాటిని కూడా మొదలు పెట్టనుందట..!



టాలీవుడ్ లో ప్రస్తుతం మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ శ్రీలీల అనే విషయం ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆమె స్టార్ హీరోలు మొదలుకు ని చిన్న హీరోల వరకు ఎంతో మందితో కలిసి నటిస్తున్న విషయం తెల్సిందే. ఇటీవల పూజా హెగ్డే స్థానం లో మహేష్ బాబు గుంటూరు టాకీస్ సినిమా ను సొంతం చేసుకుంది. ఇంతటి క్రేజ్ ను కలిగి ఉన్న ఈ అమ్మడు తీసుకుంటున్న నిర్ణయాలు ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి. ఒక వైపు స్టార్ హీరోల కు జోడీ గా కమర్షియల్ హీరోయిన్ గా వరుస ఆఫర్లు వస్తున్న నేపథ్యం లో మరో వైపు బాలయ్య వంటి సీనియర్ హీరో కు కూతురు పాత్ర లో నటించేందుకు ఓకే చెప్పడం అందరికి షాక్ ఇచ్చింది. అంతే కాకుండా సెకండ్ హీరోయిన్ పాత్ర లకు.. చిన్న హీరో కు జోడీ గా నటించేందుకు గాను ఓకే చెప్పడం విడ్డూరంగా ఉందటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఈ సమయం లోనే శ్రీలీల లేడీ ఓరియెంటెడ్ సినిమా ను చేసేందుకు ఓకే చెప్పిందనే వార్తలు వస్తున్నాయి. సాధారణంగా హీరోయిన్స్ ఆఫర్లు లేని సమయం లో లేదంటే స్టార్ గా ఓ స్థాయికి చేరుకుని చాలా సంవత్సరాలు స్టార్ హీరోల తో సినిమాలు చేసిన తర్వాత లేడీ ఓరియంటెడ్ సినిమాల కు కమిట్ అవుతారు. కానీ అప్పుడే శ్రీ లీల లేడీ ఓరియంటెడ్ సినిమా ను మొదలు పెట్టింది. ప్రముఖ ఫిల్మ్ మేకర్ సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వం లో శ్రీలీల ఒక లేడీ ఓరియంటెడ్ సినిమా ను చేసేందుకు కమిట్ అయ్యిందట. ప్రస్తుతం స్క్రిప్ట్ వర్క్ జరుగుతుందని... సింగీతం వారు చెప్పిన స్టోరీ లైన్ తెగ నచ్చిన ఆమె హీరోయిన్ గా నటించేందుకు ఓకే చెప్పిందని సమాచారం అందుతోంది. ఒక వైపు స్టార్ హీరోల సినిమా ల్లో కమర్షియల్ హీరోయిన్ గా అందాల ఆరబోత చేస్తూ దూసుకు పోతున్న ఈమె ఈ సమయం లోనే లేడీ ఓరియంటెడ్ సినిమా ను చేయడం ను అభిమానులు మిశ్రమంగా స్పందిస్తున్నారు. హీరోయిన్ గా శ్రీలీల ముందు ముందు మరింతగా స్టార్ డమ్ సొంతం చేసుకోవడానికి సింగీతం శ్రీనివాసరావు సినిమా ఉపయోగపడే అవకాశాలు ఉన్నాయని కొందరు సినీ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# నిలిచిపోయిన శివ కార్తికేయన్ సినిమా రిలీజ్.!




కోలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో అలాగే తన స్వయం కృషితో అయితే మంచి స్టార్ గా ఎదిగిన నటుడు శివ కార్తికేయన్. మరి గత ఏడాది "ప్రిన్స్" గా తెలుగు ఆడియెన్స్ ని కూడా అలరించిన తాను లేటెస్ట్ గా చేసిన ఇంటెన్స్ యాక్షన్ థ్రిల్లర్ డ్రామానే "మహా వీరుడు". దర్శకుడు మడోనే అశ్విన్ తెరకెక్కించగా తెలుగు సహా తమిళ్ రిలీజ్ కి ఈ చిత్రం వచ్చింది. అయితే అన్ని కరెక్ట్ గానే ఉన్నప్పటికీ మన తెలుగు రిలీజ్ సహా ఇపుడు యూఎస్ లో తెలుగు మరియు తమిళ్ రిలీజ్ అయితే నిలిచిపోయినట్టుగా షాకింగ్ వార్త బయటకి వచ్చింది. అయితే ఇందుకు కారణం ఇంకా కంటెంట్ డెలివరీ కాకపోవడమే అని తెలుస్తుంది. దీనితో తెలుగు సహా యూఎస్ లో ఈ చిత్రం అయితే నిలిచిపోయింది. మరి అన్నీ కరెక్ట్ చేసి మేకర్స్ త్వరలోనే రిలీజ్ చేయనున్నారు. ఇక ఈ చిత్రానికి శాంతి టాకీస్ వారు అయితే నిర్మాణం వహించారు.

# ఓపెన్ హైమర్ చూశాక దిగ్భ్రాంతికి గురయ్యాను

"సిలియన్ మర్ఫీ మహదాద్భుత నటప్రదర్శన.. గొప్ప స్థాయిలో ఒక పాత్రపై అధ్యయనం... ఒక చారిత్రక డ్రామాని తెరకెక్కించిన తీరు అసాధారణం. స్పష్టంగా నోలన్ సెన్సిబిలిటీస్ తో తెరకెక్కిన ఈ సినిమా చూస్తున్నంతసేపూ టెన్షన్ ... స్ట్రక్చర్.. సెన్స్ ఆఫ్ స్కేల్.. ఆశ్చర్యపరిచే సౌండ్ డిజైన్ విశేషమైన విజువల్స్... వావ్ అనిపిస్తాయి...". ఇదీ 'ఇన్సెప్షన్' ఫేం క్రిస్టోఫర్ నోలాన్ దర్శకత్వం వహించి 'ఓప్పెన్ హైమర్' పై ఒక విదేశీ సమీక్షకుని ముందస్తు రివ్యూ. అణుబాంబ్ తయారీ విస్ఫోటన విధ్వంశం నేపథ్యంలో అమెరికన్ న్యూక్లియర్ సైంటిస్ట్ ఓప్పెన్ హైమర్ జీవితకథను తెరపై ఆవిష్కరించారు నోలాన్. ఈనెల 21న భారతదేశం సహా ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది.



అణుబాంబ్ సృష్టికర్త రాబర్ట్ ఓపెన్ హైమర్ లైఫ్ జర్నీలో ఎన్నో విశేషాలను నాటి రాజకీయాలను తెరపై ఆవిష్కరించగా ఆ పాత్రకు సిసిలియన్ మర్ఫీ ప్రాణం పోసారని పలువురు విదేశీయులు (నెటిజనులు) ట్విట్టర్ లో సమీక్షించారు. ఇక ఈ సినిమాకి సౌండ్ డిజైన్.. నేపథ్య సంగీతం మరో లెవల్ అని కీర్తిస్తున్నారు. అలాగే సినిమాలో ఒక కీలక పాత్రలో ఎమిలీ బ్లంట్ పెర్ఫామెన్స్ కి ముగ్ధులైపోవడం ఖాయమని సమీక్షించారు.

ముఖ్యంగా తొలి రెండు గంటలు సినిమా హృదయాలకు హత్తుకుంటుందని చివరి 60 నిమిషాల్ని ప్రేక్షకులు అంగీకరించలేని రీతిలో నోలాన్ తెరకెక్కించారని కూడా కొందరు విమర్శకులు సమీక్షించారు. అయితే నోలాన్ మార్క్ సినిమా ఆద్యంతం హైలైట్ గా కనిపిస్తుందని ప్రశంసలు కురిపించారు. ఇదేమీ 'మిషన్ ఇంపాజిబుల్ – డెడ్ రికనింగ్' తరహాలో భారీ స్టంట్స్ యాక్షన్ అడ్వెంచర్స్ ఉన్న సినిమా కాదు. ఇది కేవలం ఒక బయోపిక్. సైంటిస్ట్ జీవితకథతో తెరకెక్కిన సినిమా. ఇందులో సుదీర్ఘమైన సంభాషణలు వాటిలో డెప్త్ అర్థం చేసుకున్నవారికి ఈ సినిమా కథ బాగా కనెక్ట్ అవుతుందని ఎలాంటి కాంప్లికేషన్స్ లేకుండా టెనెట్ లా కన్ఫ్యూజన్ లేని స్క్రీన్ ప్లేతో సామాన్యులకు కూడా అర్థమయ్యేలా ఓపెన్ హైమర్ ని నోలాన్ తెరకెక్కించారని విమర్శకులు అంటున్నారు. ఓపెన్ హైమర్ నటులు ఎమిలీ బ్లంట్ –ఫ్లోరెన్స్ పగ్ లండన్ లో జరిగిన ప్రీమియర్ కి అటెండయ్యారు.




Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed & published at Unyted Publications, From H.no: #50-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16. and SREE SESHASAI ENTERPRISES "D.NO : 3-88, "C/O CHANDRA THEATER," GOSALA VILLAGE, "MAIN ROAD, PENAMALURU MANDAL, KRISHNA DT, ANDHRAPRADESH, India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com
PIN: 521151."MOBILE :9912333140 Email : sreeseshasaivja@gmail.com.